మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 29-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 210 Issue: 210

29 జనవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 6:06 తిథి ఏకాదశి మ. 1:54 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం రోహిణి ఉ. 7:30 వరకు తరువాత మృగశిర ఉ. 5:29వ వరకు యోగం ఇంద్ర రా. 8:18 వరకు కరణం విష్టి మ. 1:54 వరకు బవ రా. 12:32వ వరకు వర్జ్యం మ. 12:38 నుండి మ. 2:06 వరకు దుర్ముహూర్తం ఉ. 10:36 నుండి ఉ. 11:21 వరకు మ. 3:06 నుండి మ. 3:51 వరకు రాహుకాలం మ. 1:53 నుండి మ. 3:17 వరకు యమగండం ఉ. 6:52 నుండి ఉ. 8:16 వరకు గుళికాకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు రా. 9:25 నుండి రా. 10:53 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:51 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# అజిత్ పవార్ దుర్మరణం

## చార్టర్ ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం మృతి



మహారాష్ట్రలో బుధవారం ఉదయం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో సహా విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురు మరణించినట్టుగా అధికారులు తెలిపారు. అజిత్ పవార్ బుధవారం ఉదయం ముంబై నుంచి బారామతికి చార్టర్ విమానంలో బయలుదేరారు. ఈ విమానంబారామతిలో ఉదయం 8.45 గంటలకు కుప్పకూలింది. అనంతరం పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అయితే ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న ఎవరూ కూడా ప్రాణాలతో బయటపడలేదు.



పుణె: ఈ విమానంలో ప్రయాణిస్తున్న అజిత్ పవార్, ఆయన ఇద్దరు సిబ్బంది, ఇద్దరు చార్టర్ విమానం సిబ్బంది అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయాన్ని డీజీసీఏ ధ్రువీకరించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడలేదని తెలిపింది. అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం (ప్రోటోకాల్) బుధవారం తెలిపింది. అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలోతరువాయి 2 వ పేజీలో...



## కొత్త ఆధార్ యాప్.. వచ్చేసింది!

### ఎన్నో సేవలు చేతి వేళ్లపై

కేంద్ర ప్రభుత్వం సరికొత్త యాప్‌ను లాంఛ్ చేసింది.భారత పౌరుల భద్రతను దృష్టిలో పెట్టుకుని యూఐడీఏఐ ఈ కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

న్యూఢిల్లీ: భారత విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ అందుబాటులోకి తెచ్చిన ఈ కొత్త యాప్ ద్వారా ఆధార్ సేవలు మరింత సులభతరంగా పౌరులకు అందుబాటులోకి రానున్నాయి. కొత్త ఆధార్ యాప్‌ను ఢిల్లీలో డాక్టర్.బి.ఆర్

# విదానం ఏంటో?


## రాజకీయ అవకాశవాదం.. పార్టీ మారినా బుకాయింపు

### కాంగ్రెస్ బీ ఫాంపై పోటీ.. పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ

తెలంగాణ రాజకీయాల్లో దానం నాగేందర్ ఒక ప్రత్యేకమైన శైలి కలిగిన నేత. అయితే, ఆ శైలి ప్రజాక్షేమం కోసం కాకుండా, కేవలం అధికార దాహం కోసమే అన్న విమర్శలు ఇప్పుడు తారాస్థాయికి చేరుకున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నా, స్వరాష్ట్రంలో ఉన్నా దానం తీరు మారలేదు సరే.. కానీ స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత కూడా ఆయన అనుసరిస్తున్న ఫిరాయింపుల రాజకీయం తెలంగాణ రాజకీయ నైతికతను ప్రశ్నిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒక వెలుగు వెలిగిన నేతలు సిద్ధాంతాల కోసం నిలబడితే, దానం నాగేందర్ వంటి వారు ఎప్పుడూ అధికార పీఠం ఎటువైపు ఉంటే అటువైపే మొగ్గు చూపారు.

(ఈవార్తలు- పొలిటికల్ డెస్క్)

అయితే, తెలంగాణ వచ్చాక బీఆర్‌ఎస్‌ను అంటిపెట్టుకొని ఉన్న ఆయన.. 2023లో కారు గుర్తుపై గెలిచిన కొద్దిరోజులకే కాంగ్రెస్‌లోకి దూకడం తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. కానీ, స్పీకర్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో 'నేను బీఆర్ఎస్ వాడినే' అని చెప్తూ, బయట మాత్రం 'నేను పక్కా కాంగ్రెస్ ఎమ్మెల్యేను' అని కామెంట్ చేస్తున్నారు. ఇది ఆయనలోని ద్వంద్వ స్వభావాన్ని బయటపెడుతోంది. ఇలాంటి వైఖరి ప్రజాస్వామ్య వ్యవస్థనే అపహాస్యం చేస్తోంది. అంతేకాదు.. నిన్నమొన్నటి వరకు తాను ఉన్న పార్టీకి చెందిన నేతలను, తన గెలుపుకు కృషి చేసిన సహచరులను అసెంబ్లీ వేదికగా బూతులు తిట్టడం, తోలు తీస్తా అని హెచ్చరించడం దానం రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోంది. 'నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది' అన్న దానం వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్ఠ అని రాజకీయ -2 వ పేజీలో...



# దానం.. నీ సంగతేంది?

### ఖైరతాబాద్ ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు.. అయ్యయ్యో.. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

### వ్యక్తిగత హోదాలోనే కాంగ్రెస్ భేటీకి వెళ్లా.. స్పీకర్ వద్ద దానం నాగేందర్ అఫిడవిట్

పార్టీ ఫిరాయింపులపై విచారణ దానం నాగేందర్ వద్దకు చేరుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌పై విచారణను వేగవంతం చేసిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఈ నెల 30వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): గతంలో జారీ చేసిన నోటీసులకు దానం నాగేందర్ నుంచి సరైన వివరణ రాకపోవడం, అఫిడవిట్ దాఖలు చేయడంలో జాప్యం జరగడంతో స్పీకర్ ఈసారి నేరుగా విచారణకు రావాలని ఆదేశించారు. స్పీకర్ నోటీసులపై దానం నాగేందర్ స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, 2024 మార్చిలో వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లానని, దీంతో -2 వ పేజీలో...




| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.16,708 |
| వెండి (గ్రాము): | రూ.400 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,897 |

# నయీం కేసులో ఈడీ చార్జిషీట్

## విచారణకు స్వీకరించిన రంగారెడ్డి కోర్టు

### 10 మందిపై అభియోగాలు.. రూ.11.30 కోట్ల ఆస్తుల గుర్తింపు

### నయీం భార్య, కుటుంబ సభ్యుల పేర్ల ప్రస్తావన

### నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని ఈడీ వినతి

ఏపీ, తెలంగాణలో సంచలనం సృష్టించిన గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక ముందడుగు వేసింది. మనీలాండరింగ్ ఆరోపణలపై హైదరాబాద్‌లోని రంగారెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. మనీ లాండరింగ్ నివారణ చట్టం-2002 కింద దాఖలు చేసిన ఈ చార్జిషీట్‌ను పరిశీలించిన న్యాయస్థానం, విచారణకు స్వీకరించింది.

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): ఈ కేసులో పాశం శ్రీనివాస్‌తో సహా మొత్తం 10 మందిపై ఈడీ అభియోగాలు మోపింది. నయీం గ్యాంగ్ బెదిరింపులు, బలవంతపు రిజిస్ట్రేషన్ల ద్వారా సంపాదించిన సుమారు రూ.11.30 కోట్ల విలువైన 91 ఆస్తులను 'ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్'గా గుర్తించింది. ఈ ఆస్తులను నయీం తన భార్య హసీనా బేగం, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లపై తరువాయి 2 వ పేజీలో...





# గద్దెపైకి సారలమ్మ కన్నెపల్లి నుంచి రాక

## జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం

### జనసంద్రమైన మేడారం.. మంత్రులు సీతక్క, అడ్లూరి పూజలు

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరలో అత్యంత కీలక ఘట్టం బుధవారం భక్తి పరవశ్య వాతావరణంలో ఆవిష్కృతమైంది. కోట్ల మంది భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఘడియ సాయంత్రం ప్రారంభమవగా, కన్నెపల్లి నుంచి గద్దెపైకి శ్రీ సారలమ్మ కొలువు తీరడం జాతరలో తొలి ప్రధాన ఘట్టంగా నిలిచింది.

(మేడారం-ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

ఈ ఘట్టానికి ముందుగా పూజారులు, జిల్లా యంత్రాంగం కన్నెపల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క దేవతల పూజారులు సిద్ధబోయిన వారి ఇంటికి చేరి సంప్రదాయ కార్యక్రమాలు చేపట్టగా, కొండాయి గ్రామం నుంచి గోవింద రాజుల దేవతను కన్నెపల్లికి తీసుకువచ్చారు. అనంతరం సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, పూజారులు కాక వెంకటేశ్వర్లు, కాక కిరణ్ కుమార్, కాక కనకమ్మ, కాక భుజంగరావు, కాక లక్ష్మీబాయిలతో పాటు గోవిందరాజుల పూజారి దుబ్బకట్ల గోవర్ధన్ కలిసి ఆదివాసీ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



జపాన్ స్కూళ్లలో మధ్యాహ్న భోజనంలో న్యూట్రిషన్లు కలిగిన, నాణ్యమైన ఆహారం అందించాలని అక్కడి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అన్నం, చేపలు/మాంసం, కూరగాయలు, సూప్, పాలతో మెనూ అందజేయాలని నిర్ణయించింది. తద్వారా విద్యార్థులకు పోషకాహారం అందుతుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాదు.. జీవితాంతం ఇదే ఆహారం తినేలా విద్యార్థులకు ఆహారపు అలవాట్లు కూడా పాఠశాలల్లో నేర్పిస్తున్నారు.



# వెండి రూ.4,00,000


### 24 గంటల్లోనే రూ.13,000 పెరుగుదల

ముంబై: బులియన్ మార్కెట్‌లో మంటలు చెలరేగుతున్నాయి. బంగారం, వెండి ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తూ ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో బుధవారం వెండి ధర ఏకంగా రూ.4 లక్షల మార్కును తాకి సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం తరువాయి 2 వ పేజీలో...

# 16,000 మంది లేఆఫ్

### అమెజాన్‌లో భారీస్థాయిలో ఉద్యోగుల తొలగింపు

### సంస్థాగత మార్పుల్లో భాగంగానే ఈ నిర్ణయమని వెల్లడి



న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. మూడు నెలల వ్యవధిలో కంపెనీ ఇంత పెద్ద -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

29.1.2026

మేషం: మిత్రుల నుండి కొంత ఆసక్తి సమాచారం అందుతుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉ ఒడటం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో అంతంత మాత్రంగా సాగుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు.

వృషభం: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. నూతన వస్తు లాభాలు పొందుతారు. వ్యాపార ఉద్యోగాలలో సకాలంలో నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మిధునం: నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. ఆప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను అధిగమిస్తారు.

కర్కాటకం: దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల నుండి అవసరానికి సహాయం అందక ఇబ్బంది పడతారు. పాత ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార వ్యవహారాలలో ఒడిదుడుకులు తప్పవు. వృత్తి ఉ ద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

సింహం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. రావలసిన ధనం సకాలంలో అందక నిరాశ కలుగుతుంది. వ్యాపారాలలో శ్రమ అధికమవుతుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది.

కన్య: నూతన వ్యక్తుల పరిచయాలు ఉపయోగపడతాయి. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. వ్యాపారాలలో నూతన ఆలోచనలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

తుల: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమౌతాయి. బంధు మిత్రులతో వివాదాలు తీరుతాయి. వృత్తి ఉ ద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృశ్చికం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు పెరుగుతాయి. ధన పరంగా ఒడిదుడుకులు అధికమౌతాయి. అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉ ద్యోగపరంగా చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక మానసిక సమస్యలు కలుగుతాయి.

ధనస్సు: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ప్రశాంతత కోసం దైవదర్శనం చేసుకోవడం మంచిది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: కొన్ని వివాదాలకు సంబంధించి సన్నిహితులు నుండి కీలక సమాచారం అందుతుంది. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నూతన వస్తు లాభాలు పొందుతారు. సమాజంలో పెద్దల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఉ ద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: బంధు మిత్రుల మాటలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. అధిక శ్రమతో గాని పనులు పూర్తి కావు. ఇంటాబయట పరిస్థితులు వ్యతిరేకంగా ఉ ఒటాయి. ఉదర సంబంధిత అనారోగ్య సమస్యలు కలిగే సూచనలున్నవి. ఉద్యోగాలలో అధికారులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు.

మీనం: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలను ఆచరణలో పెడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది.

# అజిత్ పవార్ దుర్మరణం

**మొదటి పేజీ తరువాయి**

జరగనున్నాయి. ఈ మేరకు విద్యా ప్రతిష్ఠాన్ ట్రస్టీ కిరణ్ వివరాలు వెల్లడించారు. అటు.. అజిత్ పవార్ అంత్యక్రియలకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు హాజరయ్యే అవకాశం ఉంది. అజిత్ పవార్ అంత్యక్రియలకు పలువురు కేంద్ర మంత్రులు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, పలువురు మంత్రులు, పలువురు రాజకీయ నాయకులు హాజరుకానున్నారు.

### ప్రమాదాల్లో మరణించిన ప్రముఖులు వీళ్లే..

వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి అజిత్ పవార్ వరకు.. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ విమాన ప్రమాదంలో మృతిచెందారు. పుణేలో చార్టర్డ్ విమానం కూలిపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా చనిపోయారు.

అజిత్ పవార్ (2026): మహారాష్ట్ర ఉ పముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ విమాన ప్రమాదంలో మరణించారు. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది (ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు) మరో ఇద్దరు (పైలట్, కో-పైలట్) మొత్తం ఐదుగురు ఈ చార్టర్ విమానంలో ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో ఏ ఒక్కరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. అజిత్ పవార్ మహారాష్ట్రలో ఆరు సార్లు డిప్యూటీ సీఎంగా పనిచేశారు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు.

విజయ్ రూపానీ (2025 ): గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ జూన్ 12, 2025న జరిగిన విమాన ప్రమాదంలో మృతిచెందారు. అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం -171 విమానం కొద్దిసేపటికే కూలిపోయింది. 200కు పైగా విమాన ప్రయాణికులు ఇందులో ఉన్నారు. చనిపోయిన వారిలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ఉన్నారు.

డోర్జీ ఖండు (2011): అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న డోర్జీ ఖండు ఏప్రిల్ 30, 2011న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తవాంగ్ జిల్లా సమీపంలోని మారుమూల హిమాలయ భూభాగంలో ఈ ప్రమాదం జరిగింది. అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు ఉండేటువంటి పర్వత ప్రాంతాల గుండా ప్రయాణించినహెలికాప్టర్ కొంత సమయంలోనే సిగ్నల్స్ కోల్పోయింది. భారత వైమానిక దళం, సైన్యంతో రోజుల తరబడి వెతికిన తర్వాత దట్టమైన అటవీ ప్రాంతంలో ఎత్తైన ప్రదేశంలో శిథిలాలును గుర్తించారు. వాతావరణ పరిస్థితుల వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లుగా గుర్తించారు. హెలికాప్టర్‌లో ఉన్న ఐదుగరు ప్రాణాలు కోల్పోయారు.



వైఎస్ రాజశేఖర్ రెడ్డి (2009): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, సెప్టెంబర్ 2, 2009న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. పొలిటికల్ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి చిత్తూరు జిల్లాకు బయల్దేరిన బెల్ 430 హెలికాప్టర్ అదృశ్యమైంది. ఎన్నో రోజుల ప్రత్యేక బృందాల ద్వారా గాలించి నల్లమల అటవీ ప్రాంతంలో శిథిలాలను గుర్తించారు. భారీ వర్షం, తక్కువ విజిబిలిటీ వల్ల హెలికాప్టర్ కూలిపోయిందని దర్యాప్తులో తేలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉ న్న ఐదుగురు వ్యక్తులు మరణించారు.

ఓం ప్రకాష్ జిందాల్, సురేందర్ సింగ్ (2005): హర్యానా విద్యుత్ శాఖ మంత్రి ఓం ప్రకాష్ జిందాల్, రాష్ట్ర వ్యవసాయ మంత్రి సురేందర్ సింగ్ మార్చి 3, 2005న ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. హెలికాప్టర్ ఢిల్లీ నుంచి చండీగఢ్‌కు వెళ్తుండగా టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. సాంకేతిక వైఫల్యం , తక్కువ విజిబిలిటీ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా దర్యాప్తులో వెల్లడైంది. వీరితో పాటు 2002లో లోక్ సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, 2001లో సీనియర్ కాంగ్రెస్ లీడర్, కేంద్ర మంత్రి మాధవ రావు సింధియా, 1980లో సంజయ్ గాంధీ కూడా విమాన ప్రమాదంలో చనిపోయారు.



# దానం.. నీ సంగతేంది?

**మొదటి పేజీ తరువాయి**

మీడి యాలో వచ్చిన కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని స్పీకర్ వద్ద అఫిడవిట్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టివేయాలని సభాపతిని కోరారు. 2023లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచానని, ఆ పార్టీకి తాను రాజీనామా చేయలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన విషయం కూడా తనకు తెలియదని అన్నారు. ఓసారి కాంగ్రెస్ సమావేశానికి వెళ్లినప్పటికీ వ్యక్తి గత హోదాలో వెళ్లానని పేర్కొన్నారు. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి తన అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదని అన్నారు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

### కాంగ్రెస్ బీఫాంపై ఎంపీగా పోటీ

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీ-ఫామ్‌పై సికింద్రాబాద్ ఎంపీగా బరిలోకి దిగారు. అయినా, తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, వ్యక్తిగతంగా మాత్రమే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లానని చెప్పడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. అయితే, పార్టీ ఫిరాయించినట్లు బలమైన సాక్ష్యాధారాలు ఉన్న నేపథ్యంలో దానంపై స్పీకర్ అనర్హత వేటు తప్పదనే వాదన బలంగా వినిపిస్తోంది.

# విదానం ఏంటో?

**మొదటి పేజీ తరువాయి**

విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ప్రజలు పార్టీ సిద్ధాంతాలను చూసి ఓటు వేస్తారనే కనీస గౌరవం ఆయనకు లేకపోవడం బాధాకరం అని అంటున్నారు. చట్టసభల్లో నిలబడి ప్రజల గొంతుక కావాల్సిన నాయకుడు, నేడు తన అనర్హత వేటును ఆపుకోవడానికి న్యాయస్థానాల చుట్టూ, స్పీకర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ కాలాన్ని వృథా చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తాజా నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, జనవరి 30న జరిగే విచారణలో దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తు తేలాల్సి ఉంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే, ఇలాంటి ఫిరాయింపుదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే తెలంగాణ రాజకీయం మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది.

# వెండి రూ.4,00,000

**మొదటి పేజీ తరువాయి**



24 గంటల వ్యవధిలోనే వెండి కేజీకి రూ.13,000 పెరగడం విశేషం. పసిడి కూడా ఏమాత్రం తగ్గకుండా భారీగా ఎగబాకి కొనుగోలుదారులకు షాకిచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న రాజకీయ, ఆర్థిక పరిణామాలే దీనికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కెనడాపై 100 శాతం టారిఫ్స్ విధిస్తానన్న ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు సురక్షితమైన బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని తాకాయి. గోల్డ్ కంటే వెండి ఈసారి ఊహించని రీతిలో పెరిగింది. ఈ నెల ప్రారంభంలో రూ.2.56 లక్షల వద్ద ఉన్న కేజీ వెండి ధర, కేవలం 28 రోజుల్లోనే రూ.4,00,000కు చేరింది. అంటే దాదాపు 56 శాతం పెరిగింది. బుధవారం ఒక్కరోజే కేజీకి రూ.13,000 అదనంగా పెరగడం బులియన్ చరిత్రలోనే అరుదైన విషయం. పారిశ్రామికంగా, ముఖ్యంగా సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రానిక్ రంగాలో వెండి వినియోగం పెరగడం కూడా ఈ భారీ ర్యాలీకి ఊతమిచ్చింది. అటు బంగారం కూడా సరికొత్త రికార్డులను తిరగరాసింది. 24 క్యారెట్ల (స్వచ్ఛమైన) 10 గ్రాముల బంగారం ధర రూ.5,130 పెరిగి రూ.1,67,080కి చేరింది. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ రేట్ల పెరుగుదల సామాన్య ప్రజలను కలవరపెడుతోంది. నిపుణుల అంచనాల ప్రకారం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గేవరకు ఈ పెరుగుదల కొనసాగే అవకాశం ఉంది.

# 16,000 మంది లేఆఫ్

**మొదటి పేజీ తరువాయి**

మొత్తంలో ఉద్యోగాల కోత విధించడం ఇది రెండోసారి. సంస్థలో చేపడుతున్న అదనపు సంస్థాగత మార్పులలో భాగంగానే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ విషయంపై అమెజాన్ పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గెల్లెట్టి ఒక బ్లాగ్ పోస్ట్‌లో స్పందించారు. 'ఇది కష్టమైన వార్త అని నాకు తెలుసు. సంస్థను బలోపేతం చేసేందుకు, అనవసరమైన లేయర్‌లను తగ్గించి, యాజమాన్య బాధ్యతను పెంచేందుకు అక్టోబర్‌లో ప్రారంభించిన ప్రక్రియను కొన్ని బృందాలు ఇప్పుడు పూర్తి చేశాయి' అని ఆమె వివరించారు. ఈ క్రమంలోనే సుమారు 16,000 ఉద్యోగాలపై ప్రభావం పడుతోందని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగం కోల్పోయిన వారికి అండగా ఉంటామని అమెజాన్ హామీ ఇచ్చింది. అమెరికాలోని ఉద్యోగులకు కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి 90 రోజుల సమయం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఆ తర్వాత కూడా ఉద్యోగం దొరకని వారికి సెవరాన్స్ ప్యాకేజీ, ఆరోగ్య బీమా, ఔట్‌ప్లేస్‌మెంట్ సేవలు వంటి ప్రయోజనాలను అందిస్తామని స్పష్టం చేసింది. అయితే, ప్రతి కొన్ని నెలలకు ఇలాంటి లేఆఫ్‌లు ప్రకటించడం తమ ప్రణాళిక కాదని కంపెనీ స్పష్టం చేసింది. అదే సమయంలో తమ భవిష్యత్తుకు అవసరమైన వ్యూహాత్మక విభాగాల్లో పెట్టుబడులు, నియామకాలు కొనసాగిస్తామని బెత్ గెల్లెట్టి తెలిపారు. గతంలో ప్రకటించిన 14,000 ఉద్యోగాల కోతకు ఇది అదనం.

# కొత్త ఆధార్ యాప్.. వచ్చేసింది!

**మొదటి పేజీ తరువాయి**

అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు.

### కొత్త ఆధార్ యాప్ ఫీచర్లు ఇవే!

- సులభంగా ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు.
- చిరునామా, మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సౌకర్యం ఉంటుంది.
- కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను షేర్ చేసుకోవచ్చు.
- ఐదుగురు ఆధార్ ప్రొఫైల్ వివరాలను సులభంగా క్రియేట్ చేసుకోవచ్చు.
- ఫేస్ అథెంటికేషన్, బయోమెట్రిక్ లాక్, క్యూఆర్ షేరింగ్ వంటి ఎన్నో ఫీచర్లు ఉన్నాయి.
- ఈ కొత్త యాప్ మీ వద్ద ఉంటే, ఆధార్ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేదు.
- కుటుంబ సభ్యుల ఆధార్ డేటా మొత్తం ఒకే డివైజ్‌లో పొందుపరుచుకోవచ్చు.

## గద్దెపైకి సారలమ్మ కన్నెపల్లి నుంచి రాక

**మొదటి పేజీ తరువాయి**

ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు కన్నెపల్లి సారలమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సుమారు సాయంత్రం 7 గంటలకు సారలమ్మ అమ్మవారు కన్నెపల్లి నుంచి బయలుదేరారు. జంపన్న వాగు మీదుగా మేడారం గ్రామానికి చేరుకున్న సందర్భంగా పూనకాలతో తన్మయత్వానికి లోనైన భక్తులు, డప్పు వాయిద్యాల నడుమ దారిపొడవునా అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. ఈ ఘట్టంతో మేడారం పరిసరాలు భక్తి పరవశ్యంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అర్ధరాత్రి 12.30 గంటలకు గద్దెల ప్రాంతానికి చేరుకున్న సారలమ్మ అమ్మవారికి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోవిందరాజులు, పగిడిద్దారాజులతో కలిసి అర్ధరాత్రి గద్దెపైకి అమ్మవారు చేరుకున్నారు. ప్రధాన పూజారి సారయ్య అమ్మవారిని గద్దెలపైకి తీసుకొచ్చి కొలువు తీర్చారు. ఈ ఘట్టానికి ముందు మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్ సారలమ్మకు పూజలు చేశారు. దీంతో మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరలో తొలి కీలక ఘట్టం విజయవంతంగా పూర్తయ్యింది.

## విద్య, ఉద్యోగవాణి

ఎస్బీఐ సీబీవో
రిక్రూట్‌మెంట్-2026
సంస్థ పేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పోస్ట్ పేరు: సర్కిల్ బేస్డ్ ఆఫీసర్
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
దరఖాస్తు తేదీలు: 29 జనవరి 2026 - 18 ఫిబ్రవరి 2026 వరకు
పరీక్ష తేదీ: మార్చి 2026
అర్హత: ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ (ఐడీడీ) హోల్డర్లు అర్హులు
వయోపరిమితి: 21-30 మధ్య గలవారు, ఎస్బీఐ నిబంధనల ప్రకారం ఎస్సీ /ఎస్టీ /ఓబీసీ /పీఎండబ్ల్యూబీడీ /మాజీ సైనికులకు వయో సడలింపు.
రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ వారికి రూ.750, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ వారికి ఫీజు లేదు.
వెబ్‌సైట్:https://sbi.bank.in.web/careers/current-openings

# నయీం కేసులో ఈడీ చార్జిషీట్

బినామీలుగా రిజిస్టర్ చేసినట్లు దర్యాప్తులో నిర్ధారించింది. అనేకసార్లు నోటీసులు జారీ చేసినా నిందితులు విచారణకు హాజరుకాకపోవడం, ఆదాయపు పన్ను రిటర్న్ కూడా దాఖలు చేయకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు ఉ పక్రమించింది. విచారణకు రాని వారిపై నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని కోర్టును కోరినట్లు సమాచారం. ఇప్పటికే ఈ 91 ఆస్తులను బినామీ చట్టం కింద ఐటీ శాఖ అటాచ్ చేసింది. తాజాగా ఈడీ కూడా వీటి జప్తునకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ కేసులో నయీంకు సహకరించిన కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల ఆర్థిక లావాదేవీలపైనా ఈడీ దృష్టి సారించింది. కోర్టు చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించిన నేపథ్యంలో నిందితులకు త్వరలోనే నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉంది.





# కేసీఆర్ అప్పు అబద్ధం: కేటీఆర్

## ఓపిక లేని వ్యక్తి తెలంగాణను పాలిస్తున్నారని ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకటే అబద్ధం చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఏడెనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని వారు చెబుతున్నారని, కానీ పార్లమెంటులో బీజేపీ ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చిందని అన్నారు. కేసీఆర్ హయాంలో రూ.3.5 లక్షల కోట్ల అప్పులు అయ్యాయని తేలిందని, అందులో కేసీఆర్ గద్దెను ఎక్కే నాటికి రూ.72 వేల కోట్ల అప్పు తెలంగాణకు ఉందని తెలిపారు. అంటే కేసీఆర్ పదేళ్ల కాలంలో చేసిన అప్పు రూ.2.5 లక్షల కోట్లు మాత్రమే అన్నారు. ఆ అప్పు తో కూడా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఆరూరి రమేశ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారని, కానీ 2023లో 16 వేల ఓట్లతో ఓడిపోయారని అన్నారు. కానీ ఈసారి భారీ మెజారిటీతో వర్ధన్నపేటలో ఆరూరి రమేశ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే దయచేసి కొత్త, పాత అని చూడవద్దని, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోజు ఓపిక లేని, తెలివి లేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. నిత్యం కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప ఏదీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఈ రెండున్నర సంవత్సరాలలో లక్షల కోట్ల అప్పులు చేసి ఏం చేశారని ప్రశ్నించారు. రైతు బంధు ఎగ్గొట్టారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. అయినప్పటికీ అప్పులు ఎందుకయ్యాయని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు మొదలు ప్రతి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చారనే విషయం ఆలోచించవద్దని, గులాబీ కండువా కప్పుకుని వస్తే కేసీఆర్‌గా భావించి ఓటు వేయాలని సూచించారు. కుటుంబం అన్నాక విభేదాలు ఉంటాయని, కానీ బీఫామ్ ఇచ్చాక అందరూ కలిసి పోవాలని అన్నారు. గులుగుడు గులుగుడే.. గుద్దుడు గుద్దుడే అని వ్యాఖ్యానించారు.



# కడియం వల్లే బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పా: ఆరూరి

## కేటీఆర్ సమక్షంలో తిరిగి గులాబీ పార్టీలో చేరిక

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడు తూ, కడియం శ్రీహరి లాంటి వ్యక్తుల వల్లే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లవలసి వచ్చిందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురద చల్లి వారు రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని ఆరోపించారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకొని, వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమైన వ్యక్తి కడియం శ్రీహరి అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కోసం కోవర్టుగా పని చేశారని ఆరోపించారు. ఆయన చేసిన మోసం వల్ల ఫలితాలు బీఆర్ఎస్‌కు ఎలా వచ్చాయో అందరికీ తెలుసని, అందుకే పార్లమెంట్ ఎన్నికల సమయంలో తాను బయటకు వెళ్లానని అన్నారు. ఇప్పుడు ఆ పాపాత్ముడు బయటకు పోయాడు కాబట్టి తిరిగి సొంత ఇంటికి వచ్చానని అన్నారు. చిన్నప్పుడు పిల్లవాడు తప్పిపోయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తే ఎలా సంబరం ఉంటుందో ఇప్పుడు పార్టీలో, తనకు అంతటి సంతోషం ఉందని అన్నారు. ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోవడానికి కడియం శ్రీహరి కారణమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కడియం శ్రీహరి వంటి మోసపూరిత వ్యక్తికి టిక్కెట్ ఇచ్చారనే ఆవేదనతోనే అతను పార్టీ నుంచి వెళ్లిపోయాడని అన్నారు. కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై ఎప్పుడూ ఆయనకు కోపం లేదని అన్నారు. భవిష్యత్తులో ఎన్నిక ఏదైనా బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని అన్నారు.



# చెట్ల కింద కూర్చున్నా రెంట్!

### మేడారంలో భక్తులకు ధరల షాక్

### కోళ్లు, మేకల ధరలు రెట్టింపు

(మేడారం–ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే, వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ధరల మోత తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జాతర పరిసరాల్లో నిత్యావసరాల నుంచి బస చేసే గదుల వరకు అన్ని ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతరలో అమ్మవార్లకు మొక్కుగా బెల్లం(బంగారం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పించడం ఆనవాయితీ. దీన్నే అదునుగా చేసుకున్న వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 420 పలికే మేకపోతు లైవ్, మేడారంలో రూ. 900 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తున్నారు. ఇక, మటన్ ధర అయితే ఏకంగా రూ. 1500కు చేరింది. బయట మార్కెట్‌లో కిలో రూ. 170–180 ఉండే బ్రాయిలర్ కోడిని ఇక్కడ రూ. 300 నుంచి రూ. 350కి అమ్ముతున్నారు. నాటుకోడి ధర రూ. 700 దాటిపోయింది. జాతర చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు. మాంసం ధరలే కాకుండా, బస కోసం ఏర్పాటు చేసుకునే గదుల అద్దెలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేని చిన్న గదులకు సైతం రోజుకు రూ. 6,000 వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కేవలం ఒక్క ఫ్యాన్ మాత్రమే ఉన్న గదికి వేలకు వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇక ఇళ్లు, గదులు దొరకని వారు సేద తీరేందుకు చెట్ల నీడను ఆశ్రయిస్తుంటే, అక్కడ కూడా దోపిడీ తప్పడం లేదు. జాతర పరిసరాల్లోని తోటల యజమానులు చెట్ల కింద నీడను సైతం అద్దెకు ఇస్తున్నారు. ఓ కుటుంబం వంట చేసుకుని, భోజనం చేయడానికి ఒక చెట్టు కింద నీడ కోసం రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికంగానే కొనుగోలు చేయాల్సి రావడంతో, వ్యాపారులు ఈ విధంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



# కార్పొరేట్ స్కూళ్లు బంద్ చేస్తా

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

### నల్లగొండలో కుమారుడి పేరిట ప్రభుత్వ పాఠశాల

### కార్పొరేట్ హంగులతో ప్రారంభం

నల్లగొండ, జనవరి 28 (ఈవార్తలు): రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కార్పొరేట్ విద్యాసంస్థలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను విద్యాశాఖ మంత్రి అయితే కార్పొరేట్ సంస్థలను మూసివేసి, అందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివేలా ఆదేశాలు జారీ చేస్తానని అన్నారు. మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో తన కుమారుడు దివంగత ప్రతీక్‌రెడ్డి పేరిట నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. కొన్ని కార్పొరేట్ సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు 25 శాతం సీట్లు కేటాయించకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఎల్‌కేజీ చదువులకే లక్షల్లో ఫీజులు వసూలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ప్రాబల్యం తగ్గించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేశారని గుర్తుచేశారు. అంతకుముందు, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. బొట్టుగూడ ప్రాంతంలోని ఈ పాఠశాలను 40 ఏసీ తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్స్, లైబ్రరీ వంటి సకల సౌకర్యాలతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఏదో ఒక రోజు బాంబు పేలుస్తా: రాజగోపాల్ రెడ్డి

మునుగోడు, జనవరి 28 (ఈవార్తలు): మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఏదో ఒక రోజు బాంబు పేల్చడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. తనకు పదవి రాకున్నా పర్వాలేదని, కానీ ప్రజల సమస్యలు తీరకపోతే ఏమైనా జరిగిపోతుందని ఆయన స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా మునుగోడు మండలం కోతులారం గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ కు కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పనులు చేపట్టిన బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు సగంలో నిలిపివేసి చేతులెత్తేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, వారం రోజుల్లో పూర్తిస్థాయి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సీఎం మూడు వారాలు గడిచినా ఒక్క బిల్లు కూడా చెల్లించలేదని అన్నారు. రాష్ట్రంలో కేవలం సీఎం, మంత్రుల నియోజకవర్గాలలోనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసుకుంటున్నారు తప్ప ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో బిల్లులు ఇవ్వకపోగా నూతన పనులను కూడా మంజూరు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రజల ప్రాణాలకు హాని కలిగించే మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు నియంత్రించేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నివారించకపోతే తానే మహిళలతో కలిసి గ్రామాల్లో పర్యటించి బెల్టు దుకాణాలను ధ్వంసం చేస్తానని హెచ్చరించారు.

# జంపింగ్‌ల బ్లాక్‌మెయిల్ వద్దు: మధుయాష్కీ

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలు అభివృద్ధి కోసమే అంటూ బ్లాక్‌మెయిల్ చేయకుంటే మంచిదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ హితవు పలికారు. దానం నాగేందర్ అంశం స్పీకర్ పరిధిలో ఉందని అన్నారు. కొంతమంది పోలీసు అధికారులు ప్రజా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో పోలీసులు కార్యకర్తల్లా పని చేశారని ఆరోపించారు. ఇప్పుడు కూడా కొందరు పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని, పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రులు కలిసికట్టుగా పని చేస్తున్నారని మధుయాష్కీ అన్నారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రులు సమావేశమయ్యారనేది అబద్ధపు ప్రచారం అన్నారు. ప్రతిరోజు వాళ్లంతా టచ్‌లోనే ఉంటారని అన్నారు జగిత్యాలలో జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌ల అంశంపై కూడా మధుయాష్కీ స్పందించారు. జీవన్ రెడ్డి పార్టీ మారాలనుకుంటే ఎప్పుడో మారేవారని అన్నారు. అలాంటి సీనియర్ నాయకులు పదవుల కోసం కాదని, పార్టీ కోసం పని చేస్తారని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అక్రమాలు జరిగాయన్న బీఆర్ఎస్ ఆరోపణలపై మధుయాష్కీ స్పందిస్తూ, అసలు బొగ్గే తవ్వలేదు అవినీతి ఎక్కడ జరుగుతుందని అన్నారు.

# 2న రేవంత్ కీలక సమావేశం

### కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో భేటీ



హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న తిరిగి హైదరాబాద్ రానున్నారు. సీఎం రేవంత్ రాష్ట్రానికి రాగానే ఫిబ్రవరి 2న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు, మంత్రులకు అప్పగించే భాద్యతలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై విస్తృత చర్చ జరపనున్నారు. సింగరేణి టెండర్ల వ్యవహారం, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ, మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు కైవసం చేసుకోవడం వంటి అంశాలపై సుదీర్ఘ మంతనాలు జరుపుతారని మీడియా వర్గాల సమాచారం. అటు.. ఫిబ్రవరి 3 నుంచి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఫిబ్రవరి 3న మిర్యాలగూడ, 4న జగిత్యాల, 5న చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచార సభలు జరగనున్నాయి.

# హైదరాబాద్ కమిషనరేట్‌లో 46 మంది ట్రాన్స్‌ఫర్

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ స్థాయిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 46 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను (సీఐ) బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా 32 మంది సీఐలకు కొత్త పోస్టింగ్‌లు కేటాయించారు. పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన ఈ బదిలీల్లో చాలా కాలంగా సీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులకు పోస్టింగ్‌లు లభించాయి. మరో 14 మంది ఇన్‌స్పెక్టర్లను తక్షణమే సీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఇక, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో పనిచేస్తున్న సైదులును నాంపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న టి. అశోక్‌కుమార్‌ను లాలాగూడ పీఎస్ సీఐగా బదిలీ చేశారు. ఐటీ సెల్‌లో పనిచేస్తున్న జి. రాజేందర్ గౌడ్‌కు వారాసిగూడ, స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఎస్. రాఘవేంద్రకు మంగళ్‌హాట్ బాధ్యతలు అప్పగించారు. గోషామహల్ ట్రాఫిక్‌లో ఉన్న జె. రాజశేఖర్‌ను కీలకమైన టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న ఇమ్మ్యానల్‌ను సుల్తాన్‌బజార్ ట్రాఫిక్‌కు, రాజును గోషామహల్ ట్రాఫిక్ సీఐగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# గుండెపోటుతో అమెరికాలో తెలంగాణ వాసి మృతి

వనపర్తి, జనవరి 28 (ఈవార్తలు): అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న తెలంగాణ వాసి గుండెపోటుతో మరణించాడు. తన నివాసంలో వర్క్ ఫ్రమ్ హోం చేస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు సమాచారం. తెలంగాణలోని వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన హర్షవర్ధన్ రెడ్డి(45) అమెరికాకు వలస వెళ్లాడు. గత పదేళ్లుగా ఫ్లోరిడాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. హర్షవర్ధన్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన తండ్రి సుదర్శన్‌రెడ్డి బొల్లారం గ్రామ సర్పంచ్ గా సేవలందిస్తున్నారు. ని

# మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి అమిత్ షా

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వెల్లడి

### ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ప్రచారం

హైదరాబాద్, జనవరి 28 (ఈవార్తలు): తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా రానున్నారని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం జాతీయ నేతలు కూడా వస్తున్నారని ఆయన వెల్లడించారు. పది రోజుల్లో రెండు భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తామని, ఉత్తర తెలంగాణలో ఒక సభ, దక్షిణ తెలంగాణలో మరో సభ నిర్వహిస్తామని అన్నారు. మరోవైపు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన, ఈ నెలాఖరున స్వదేశానికి రానున్నారు. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల కోసం ప్రచారం చేస్తారు. ఫిబ్రవరి 3న నల్గొండ జిల్లా మిర్యాలగూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటిస్తారు. ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి రోజు 890 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, 169 మంది బీజేపీ అభ్యర్థులు ఉన్నారు.

# ట్రాక్టర్ బోల్తా.. తల్లీకుమార్తెల దుర్మరణం

భూపాలపల్లి, జనవరి 28 (ఈవార్తలు): మేడారం మహాజాతరకు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో తల్లి, కుమార్తె అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కాటారం – మేడారం ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన కస్తూరి లక్ష్మి (45) ఆమె కుమార్తె కస్తూరి అక్షిత (21)గా పోలీసులు గుర్తించారు. మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో సుమారు 25 మంది భక్తులు మేడారం జాతరకు బయలుదేరగా, మహాముత్తారం మండలంలోని పెగడపల్లి – కేశవాపూర్ అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌ను రహదారి కిందకు దించి తిరిగి ఎక్కించే సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీ కింద తల్లి, కుమార్తె ఇద్దరూ నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో మహిళ ట్రాలీ కింద ఇరుక్కుపోగా, పోలీసులు స్థానికుల సహాయంతో ఆమెను బయటకు తీసి భూపాలపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్పీ నరేశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదం కారణంగా మేడారం వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అరవ శ్రీధర్ సస్పెండ్: జనసేన

మంగళగిరి, జనవరి 28 (ఈవార్తలు): ఏపీ రాజకీయాల్లో కలకలం రేపిన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారంలో జనసేన పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీధర్‌పై ఓ మహిళ చేసిన ఆరోపణలు, విడుదల చేసిన వీడియోల నేపథ్యంలో ఈ అంశంపై విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. విచారణ పూర్తయ్యేంత వరకు శ్రీధర్‌ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు జనసేన పార్టీ ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీ అరవ శ్రీధర్‌పై ప్రసార మాధ్యమాలలో వచ్చిన వార్తలు, ఒక మహిళ చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది" అని ప్రకటనలో పేర్కొంది. టి. శివశంకర్, తంబళ్ళపల్లి రమాదేవి, టి.సి. వరుణ్‌లతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఏడు రోజుల్లోగా కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను ఆదేశించారు. ఆరోపణల్లోని నిజానిజాలను విచారించి, వారం రోజుల్లోగా పార్టీకి నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు. ఈ నివేదికను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని, అప్పటివరకు శ్రీధర్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనరాదని జనసేన స్పష్టం చేసింది.

## ఒక రోజు ముందే పెన్షన్ల పంపిణీ

**ఏపీలోని కూటమి సర్కారు నిర్ణయం**

అమరావతి, జనవరి 28 (ఈవార్తలు): ఏపీలోని పింఛనుదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతినెలా అందించే పింఛన్లను ఈసారి ఒక రోజు ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛను డబ్బులను ఈ నెల 31వ తేదీనే లబ్ధిదారులకు అందజేయనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైన నగదును ఈ నెల 30 నాటికే సచివాలయాలకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తారు. అయితే, ఈసారి ఫిబ్రవరి 1న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు ఆదివారం కూడా వచ్చింది. ఈ కారణాల వల్ల సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ చేయించడం ఇబ్బంది అవుతుందని భావించిన ప్రభుత్వం, ఒక రోజు ముందుగానే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పింఛన్ల పంపిణీ తేదీలను ఇలా మార్చడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా పలు సందర్భాల్లో ప్రభుత్వం ఒకటో తేదీకి ముందే పింఛన్లు పంపిణీ చేసింది. సాధారణంగా నెల మొదటి తేదీన సెలవు దినం వచ్చినప్పుడు, లబ్ధిదారుల సౌకర్యం కోసం ముందుగానే నగదు పంపిణీ చేస్తున్నారు. ఇటీవలే జనవరి 1న నూతన సంవత్సరం సెలవు కావడంతో డిసెంబర్ 31నే పింఛన్లు అందజేశారు. ఇప్పుడు అదే తరహాలో ఫిబ్రవరి నెల పింఛన్లను కూడా ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించారు.

## పదో తరగతి టాపర్‌కు 10 గ్రాముల గోల్డ్

**ఓ పారిశ్రామికవేత్త బంపరాఫర్**

విజయవాడ, జనవరి 28 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించే దిశగా ఓ పారిశ్రామికవేత్త వినూత్న బహుమతిని ప్రకటించారు. కృష్ణా జిల్లా ఉంగుటూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి 10 గ్రాముల బంగారం బహుమతిగా ఇవ్వనున్నట్టు పారిశ్రామికవేత్త గుత్తా సుమన్ కుమార్ వెల్లడించారు. సుమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. కేవలం పదో తరగతికే కాకుండా 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు కూడా ఆయన ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఆయా తరగతుల్లో వార్షిక పరీక్షల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు, వారు చదువుతున్న తరగతికి సమానంగా అన్ని గ్రాముల బంగారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి, వారిని చదువులో ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సుమన్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు లక్ష రూపాయల విలువైన క్రీడా సామగ్రిని కూడా ఆయన అందజేశారు. సుమన్ కుమార్ సేవను గుర్తించిన ఎంఈవో సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

## ఫిబ్రవరి 11 నుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

అమరావతి, జనవరి 28 (ఈవార్తలు): ఏపీ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఫిబ్రవరి 11 నుంచి మార్చి 12 వరకు శాసనసభ బడ్జెట్ సమావేశాలు సుదీర్ఘంగా జరగనున్నాయి. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్నారు. సమావేశాల తొలి రోజైన ఫిబ్రవరి 11న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభమవుతుంది. అదే రోజు స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో బీఏసీ సమావేశం జరుగుతుంది. ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ తీర్మానంపై ప్రసంగించనున్నారు. ఈసారి సమావేశాల్లో కేవలం బడ్జెట్‌కే పరిమితం కాకుండా పలు కీలక బిల్లులను కూడా ఆమోదించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగా అన్ని శాఖల ఉన్నతాధికారులను ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు సమాచారం.

## ఏపీలో జంగల్ రాజ్

**దోచుకో.. పంచుకో.. తినుకో పాలన**

**కూటమి సర్కారుపై జగన్ ధ్వజం**

భీమవరం, జనవరి 28 (ఈవార్తలు): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు. "చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా? మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు. రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు. సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్‌లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు.




# గాంధీ మార్గం.. విలువల జీవనం

**నాటక రూపంలో వైష్ణవ జన తో: సీబీసీ**

హైదరాబాద్, జనవరి 28 (పీఐబీ): స్వచ్ఛతా పక్వాడా, అమరవీరుల దినోత్సవం, వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను పురస్కరించుకుని, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) బుధవారం గాంధీ మార్గం అనే కార్యక్రమం ద్వారా 'వైష్ణవ జన తో' భజనను నాటక రూపంలో ప్రదర్శించింది. తిరుమలగిరిలోని పీఎం కేంద్రీయ విద్యాలయ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీబీసీ అధికారులు విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. మహాత్మాగాంధీ ఆశయ స్ఫూర్తితో విలువలతో కూడిన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో సీబీసీ సీనియర్ అకౌంట్స్ అధికారిణి మంగళ, ఇతర అధికారులు, సిబ్బందితో పాటు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు హైదరాబాద్‌లోని వివిధ పీఎం కేంద్రీయ విద్యాలయాల్లో ఇలాంటి కార్యక్రమాలను సీబీసీ నిర్వహించనుంది.

# ఢిల్లీలో పవన్ బిజీబిజీ

## అమిత్ షాతో భేటీ.. ఉప్పాడ రక్షణ గోడ ప్రాజెక్టుపై చర్చ

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలతో పాటు, ప్రత్యేకించి ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఢిల్లీలోని అమిత్ షా నివాసంలో సాయంత్రం 5 గంటల సమయంలో ఈ సమావేశం జరిగింది. ఉప్పాడ ప్రాంతంలో సముద్రపు కోతను అరికట్టేందుకు శాశ్వత పరిష్కారంగా 'సీ ప్రొటెక్షన్ వాల్' (సముద్ర రక్షణ గోడ) నిర్మాణ ప్రతిపాదనపై పవన్ చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతిని ఆయన అమిత్ షాకు వివరించారు. కాకినాడ జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఈ ప్రతిపాదనను జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ టెక్నికల్ అడ్వైజరీ కమిటీకి సమర్పించింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం పట్ల పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ. 320-323 కోట్ల అంచనా వ్యయంతో ఈ రక్షణ గోడను నిర్మించనున్నారు. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ పరిధిలోనే ఉప్పాడ ఉంది. అక్కడి ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సముద్రపు కోత సమస్యకు కేంద్రం సహకారంతో శాశ్వత పరిష్కారం కనుగొంటానని ఆయన గతంలో హామీ ఇచ్చారు. ఆ దిశగా ఈ భేటీ ముందడుగుగా కనిపిస్తోంది. సమావేశం ఫలప్రదంగా జరిగిందని పవన్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. ఇందులో భాగంగానే



అమిత్ షాతో భేటీ అయ్యారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులపై చర్చించినట్లు జనసేన వర్గాలు తెలిపాయి.

**రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ**

పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, బుధవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. పిఠాపురంలో చేపట్టాల్సిన పలు కీలక రైల్వే అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. పిఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద చేర్చి, ఒక మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలని పవన్ ప్రధానంగా కోరారు. పిఠాపురం అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి కావడం, శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి జన్మస్థలం కావడంతో దేశవ్యాప్తంగా భక్తుల తాకిడి అధికంగా ఉందని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. అలాగే, పిఠాపురంలో సేతు బంధన్ పథకం కింద ఇప్పటికే మంజూరైన రోడ్ ఓవర్ బ్రిడ్జి ప్రాజెక్టును "పీఎం గతి శక్తి" పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల లెవల్ క్రాసింగ్ సమస్యలు తొలగి, ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయని తెలిపారు. ఈ వారధి కోసం గతంలోనే కేంద్రం రూ.59.70 కోట్లు మంజూరు చేసింది. వీటితో పాటు కాకినాడ-పిఠాపురం మధ్య రైలు కనెక్టివిటీని పెంచాలని కూడా ఆయన కోరినట్లు తెలిసింది. పవన్ కల్యాణ్ చేసిన విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రాష్ట్రంలోని ఇతర పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపైనా ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. అయితే, సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రైల్వే కోడూరు కేసులో జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్‌పై వస్తున్న ఆరోపణల గురించి విలేకరులు ప్రశ్నించగా, పవన్ కల్యాణ్ ఆకస్మికంగా మీడియా సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ వ్యవహారంపై పార్టీ అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేసిందని, నివేదిక వచ్చే వరకు శ్రీధర్‌ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశించినట్లు జనసేన వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి.



# విశాఖకు ఏఐజీ ఆసుపత్రి

## పరిశ్రమలకు భూ కేటాయింపులకు మంత్రిమండలి ఆమోదం

అమరావతి, జనవరి 28 (ఈవార్తలు): ఏపీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేయడం, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పేదలకు గృహ నిర్మాణం వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశం అనంతరం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డ్యామ్ నిర్మాణానికి అవసరమైన రాయిని సేకరించేందుకు రూ. 247 కోట్లు, లెఫ్ట్ సైడ్ కనెక్టివిటీలో నావిగేషన్ టన్నెల్ నిర్మాణం కోసం రూ. 4.49 కోట్ల అదనపు బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. డ్యామ్ నిర్మాణానికి 71.63 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం కాగా, గతంలో తవ్విన రాళ్లలో 50% మాత్రమే నాణ్యంగా ఉన్నాయని, అందువల్ల హిల్ నెం. 902 నుంచి కొత్తగా రాయిని వెలికితీయడానికి ఈ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ కు అప్పగించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల కోసం హడ్కో నుంచి రూ. 4,450 కోట్ల రుణం పొందేందుకు ఏపీ టిడ్కోకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని కేబినెట్ రాటిఫై చేసింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం జూన్ నాటికి పెండింగ్ ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, 2029 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. అమరావతిలో భూసమీకరణలో భాగంగా ప్లాట్లు పొందిన రైతుల్లో వీధిపోటు, ఇతర వాస్తు సమస్యలు ఉన్న 112 మందికి వేరే ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ అవకాశం ఒరిజినల్ అలాటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే, రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే రూ. 5000 పెన్షన్‌ను, వారి తల్లిదండ్రులు మరణిస్తే




మైనర్ పిల్లలకు బదిలీ చేసేందుకు కూడా ఆమోదం లభించింది. విశాఖపట్నంలో ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఏఐజీ (ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ) ఆసుపత్రి ఏర్పాటుకు ఎండాడలో 9.04 ఎకరాల భూమిని కేటాయించారు. ఎకరాకు రూ. 5 కోట్ల చొప్పున ఈ భూమిని కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల కోసం అవసరమైన నేపియర్ గ్రాస్ పెంపకానికి భూములను కేటాయించారు. ప్రకాశం, అన్నమయ్య జిల్లాల్లో సుమారు 1544 ఎకరాలను ఎకరాకు రూ. 15,000 వార్షిక లీజు ప్రాతిపదికన కేటాయించారు. ఇక కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల వద్ద ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధికి అవసరమైన భూములను ఏపీ మారిటైమ్ బోర్డుకు బదలాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్క్ కోసం ఏపీఐఐసీకి 77.33 ఎకరాలను ఎకరాకు రూ. 7.5 లక్షల చొప్పున కేటాయించారు. దీంతోపాటు రాష్ట్రంలో మెగా సోలార్ ప్లాంట్ల నిర్మాణం కోసం అనంతపురం, అన్నమయ్య, నంద్యాల జిల్లాల్లో వేల ఎకరాల భూమిని లీజుకు ఇచ్చేందుకు కూడా మంత్రిమండలి అంగీకరించింది. అంతర్జాతీయ అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత కుమారి యర్రాజి జ్యోతి ప్రతిభను గుర్తిస్తూ ఆమెకు గ్రూప్-1 స్థాయి ఉద్యోగం, విశాఖపట్నంలో 500 గజాల నివాస స్థలం కేటాయించాలని కేబినెట్ నిర్ణయించింది. పేదరికం నుంచి వచ్చి దేశానికి గర్వకారణంగా నిలుస్తున్న జ్యోతికి ఇప్పటికే ప్రభుత్వం రూ. 76.25 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందించిందని, భవిష్యత్తులో శిక్షణ కోసం కూడా ఆర్థిక సహాయం అందిస్తుందని మంత్రి పార్థసారథి వెల్లడించారు. తిరుపతి లడ్డూ ప్రసాదం నాణ్యతపై వచ్చిన ఆరోపణల గురించి కేబినెట్‌లో చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. లడ్డూలో కల్తీ జరిగిందన్నది వాస్తవమేనని, అయితే ఏ పదార్థాలు కలిపారనే దానిపై పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అధికారిక నివేదిక రాకుండా బాధ్యతగల ప్రభుత్వం మాట్లాడదని స్పష్టం చేశారు. ఇవే కాకుండా పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనపు పడకలు, 837 కొత్త పోస్టుల మంజూరు, పలమనేరు ఏఎంసీకి భూమి బదలాయింపు, రాజకీయ పార్టీల కార్యాలయాలకు 50 సెంట్ల స్థలం కేటాయింపు వంటి పలు ఇతర నిర్ణయాలను కూడా మంత్రిమండలి ఆమోదించింది.

## చిన్నారులకు సోషల్ మీడియా వద్దు

ఏపీ మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

అమరావతి, జనవరి 28 (ఈవార్తలు): నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సోషల్ మీడియా జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై సచివాలయంలో ఏర్పాటుచేసిన మంత్రుల బృందం సమావేశానికి మంత్రి లోకేశ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్‌లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను పరిగణనలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీనిపై చర్చించేందుకు గూగుల్, మెటా, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్-46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి అడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కంప్యూటర్ రిలేటెడ్ ఎఫెండర్స్, సైబర్ లా ఎఫెండర్స్ కట్టడి, సైబర్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్ పోర్టు వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.


# పెళ్లంటేనే మంట అంటున్న చైనీస్

## పెళ్లిళ్లకు దూరం.. పిల్లల్ని కనేందుకు విముఖత.. చైనాలో తీవ్రమవుతున్న జనాభా సంక్షోభం

**చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిన జననాల రేటు**



బీజింగ్: చైనా తీవ్ర జనాభా సంక్షోభంలో కూరుకుపోతోంది. దేశంలో జననాల రేటును పెంచేందుకు, యువతను పిల్లల్ని కనేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. గతేడాది దేశంలో జననాల సంఖ్య చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోవడమే ఇందుకు నిదర్శనం. ఈ పరిణామం చైనా ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై తీవ్రమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది. తాజా అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది చైనాలో కేవలం 7.92 మిలియన్ల జననాలు మాత్రమే నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో (9.54 మిలియన్లు) పోలిస్తే ఇది 17 శాతం తక్కువ. 1949 తర్వాత ఇంత తక్కువ జననాలు నమోదు కావడం ఇదే తొలిసారి. ఇదే సమయంలో మరణాల సంఖ్య 11.31 మిలియన్లకు పెరగడంతో మొత్తం జనాభా 3.39 మిలియన్లు తగ్గి 1.4049 బిలియన్లకు చేరింది. ప్రభుత్వ కుటుంబ నియంత్రణ విధానాలు, పిల్లల సంరక్షణ సబ్సిడీలు విఫలమయ్యాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని ఒక మీడియా నివేదిక పేర్కొంది. దశాబ్దాలుగా అమలు చేసిన కఠినమైన కుటుంబ నియంత్రణ విధానాల వల్ల ఏర్పడిన జనాభా అసమతుల్యత, ప్రస్తుత సామాజిక-ఆర్థిక సవాళ్లు ఈ పరిస్థితికి కారణంగా నిలుస్తున్నాయి. యువత పెళ్లిళ్లు ఆలస్యంగా చేసుకోవడం లేదా చేసుకోకపోవడం, అధిక జీవన వ్యయం, గృహ వసతి సమస్యలు, ఉద్యోగాల్లో తీవ్రమైన పోటీ వంటి కారణాలతో పిల్లల్ని కనడానికి విముఖత చూపుతున్నారు. ఈ జనాభా క్షీణత దీర్ఘకాలంలో దేశ ఉత్పాదకతను దెబ్బతీయడంతో పాటు, పింఛను వ్యవస్థపై తీవ్ర భారం మోపుతుందని, దేశీయ మార్కెట్‌ను బలహీనపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు చైనా ప్రభుత్వం గత ఏడాది పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. మూడేళ్లలోపు పిల్లలకు 10,800 యువాన్ల (సుమారు రూ. 1.42లక్షలు) వరకు సబ్సిడీ, ప్రసవ సంబంధిత ఖర్చులకు బీమా విస్తరణ, వివాహ నమోదును సులభతరం చేయడం, విడాకుల ప్రక్రియను కఠినతరం చేయడం వంటి చర్యలు చేపట్టింది. ఈ చర్యల ఫలితంగా వివాహాల సంఖ్యలో స్వల్ప సానుకూలత కనిపించింది. 2025 మొదటి మూడు త్రైమాసికాల్లో వివాహ రిజిస్ట్రేషన్లు 8.5శాతం పెరిగాయి. దీనివల్ల 2026లో జననాల సంఖ్య 8 మిలియన్లు దాటవచ్చని అంచనా. అయితే, వివాహాలు స్వల్పంగా పెరిగినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని విశ్లేషకులు అంటున్నారు. సంతానోత్పత్తి వయసులో ఉన్న మహిళల సంఖ్య తగ్గడం, పిల్లల్ని కనాలనే ఆసక్తి లేకపోవడం ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. కేవలం విధానపరమైన మార్పులే కాకుండా.. అందుబాటు ధరల్లో గృహ వసతి, మెరుగైన పని-జీవిత సమతుల్యత, లింగ సమానత్వం, నమ్మకమైన శిశు సంరక్షణ వంటి సమగ్ర మద్దతు కల్పిస్తేనే ఈ జనాభా క్షీణతను అడ్డుకోగలమని వారు అభిప్రాయపడుతున్నారు.



## కశ్మీర్‌లో భారీ హిమపాతం

**సోనామార్గ్‌లో మంగళవారం రాత్రి ఘటన**

**వెంటాడుతున్న మంచు తుపాన్**

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ లోని ఓ రిసార్ట్ ను భారీ హిమపాతం ముంచెత్తింది. అలల్లాగా ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మంచు.. రిసార్ట్ తో పాటు చుట్టుపక్కల భవనాలనూ కమ్మేసింది. మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఈ భయానక ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. సోషల్ మీడియాలో ఈ వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది. జమ్మూ కశ్మీర్ ను వెంటాడుతున్న మంచు తుపాన్ కారణంగా ఈ అవలాంచీ ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఏకధాటిగా కురుస్తున్న మంచు ఒక్కసారిగా రిసార్ట్ ను ముంచెత్తిందని చెప్పారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వివరించారు. జమ్మూ కశ్మీర్ లో దాదాపు అన్నిచోట్లా అత్యంత కఠిన వాతావరణం నెలకొంది. ఓవైపు మంచు విపరీతంగా కురుస్తుండడంతో పాటు.. మరోవైపు చలిగాలులు అక్కడి ప్రజలను వణికిస్తున్నాయి. శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గామ్, అనంతనాగ్, కార్గిల్, సోన్‌మార్గ్, కుప్వారా, పుల్వామా, బేతాబ్ వ్యాలీ, పట్నీటాప్, పూంఛ్, కిష్టవార్.. ఇలా అన్నిచోట్లా హిమపాతం కురుస్తోంది. రోడ్ల మీద అడుగులకొద్దీ మంచు పేరుకుపోతోంది. చెట్లు, ఇళ్ల పైకప్పులపై దట్టంగా మంచు పేరుకుపోయింది. కాగా, ఉత్తరాఖండ్ లోని పలు ఎత్తైన ప్రాంతాలకు కూడా వాతావరణ శాఖ అధికారులు అవలాంచీ హెచ్చరికలు జారీ చేశారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా పలు ప్రాంతాల్లో హిమపాతం కారణంగా ఈ హెచ్చరికలు జారీ చేశారు.

## భారత్‌కే ఎక్కువ ప్రయోజనం

**భారత్-ఈయూ డీల్‌పై అమెరికా వ్యాఖ్యలు**

న్యూయార్క్: భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

# కెమికల్స్‌తో చెక్కి..!

**బంగారు పొర దోపిడీ**

**శబరిమల కేసులో వీడిన చిక్కుముడి**



శబరిమల: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శబరిమల గర్భగుడి స్వర్ణ బంధనం (బంగారు తాపడం) చోరీ కేసులో కీలక పురోగతి లభించింది. గర్భగుడి తలుపులను మార్చలేదని, వాటిపై ఉన్న రాగి రేకుల మీద నుంచి బంగారు పొరను మాత్రమే నేర్పుగా దోచుకున్నారని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఈ మేరకు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ శాస్త్రవేత్తలు సమర్పించిన నివేదికను, ప్రత్యేక దర్యాప్తు బృందం బుధవారం కేరళ హైకోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం గర్భగుడికి ఉన్నవి అసలైన రాగి రేకులేనని, వాటిని మార్చలేదని వీఎస్ఎస్‌సీ శాస్త్రవేత్తలు తమ నివేదికలో స్పష్టం చేశారు. తలుపుల చెక్క ఫ్రేమ్‌వర్క్ (స్థానికంగా 'కట్టిల్' అంటారు) కూడా పాతదేనని నిర్ధారించారు. దొంగిలించబడింది ఘనమైన బంగారం కాదని, రాగి రేకులపై ఉన్న బంగారు పొర మాత్రమేనని తేల్చారు. కొన్ని రేకులపై బంగారం శాతం గణనీయంగా తగ్గడాన్ని బట్టి, రసాయనాలను ఉపయోగించి బంగారాన్ని వేరు చేసి ఉంటారని అంచనా వేశారు. రేకులపై కనిపించిన మార్పుల వల్ల వాటిని పూర్తిగా మార్చేసి ఉంటారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. అయితే, బంగారం వెలికితీతకు ఉపయోగించే పాదరసం వంటి రసాయనాల ప్రయోగం వల్లే వాటి ఉపరితలంలో మార్పులు వచ్చాయని, భౌతికంగా వాటిని మార్చలేదని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ వాదనతో అంతర్జాతీయ ముఠాలకు విక్రయించి ఉంటారన్న ఊహాగానాలకు తెరపడినట్టయింది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని విశ్లేషణలు కొనసాగుతున్నాయని, పాత గర్భగుడి తలుపుల నమూనాలతో పోల్చి తుది నివేదికను త్వరలోనే సమర్పిస్తామని వీఎస్ఎస్‌సీ అధికారులు సిట్‌కు తెలిపారు. ఈ శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తునకు స్పష్టమైన దిశానిర్దేశం లభించింది. గర్భగుడి నిర్మాణాలను మార్చకుండా, కేవలం రసాయన ప్రక్రియ ద్వారా బంగారాన్ని ఎలా దొంగిలించారు, ఈ నేరం వెనుక ఉన్నదెవరు అనే కోణంలో ఇప్పుడు విచారణ జరగనుంది.

# వికసిత్ భారత్‌కు 2026 పునాది

**ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము**

**పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం**

**నేడు ఆర్థిక సర్వే.. 1న కేంద్ర బడ్జెట్**



న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

# ఫస్ట్ ఆఫీసర్ శాంభవీ పాఠక్ దుర్మరణం

**బారామతి విమాన ప్రమాదంలో మృతి**

**చిన్న వయస్సులోనే కమర్షియల్ విమానాలు నడిపే లైసెన్స్**

**న్యూజిలాండ్‌లో కమర్షియల్ పైలట్ అకాడమీలో శిక్షణ**





ముంబై: మహారాష్ట్రలోని బారామతిలో కూలిపోయిన విమానంలో మృతి చెందిన పైలట్‌లలో కెప్టెన్ శాంభవీ పాఠక్ ఒకరు. ఈ ప్రమాదంలో కీలక రాజకీయ నాయకుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందిన విషయం తెలిసిందే. కెప్టెన్ శాంభవి పాఠక్ ఆ విమానంలో ఫస్ట్ ఆఫీసర్ (కొన్ని సందర్భాల్లో కో-పైలట్ అంటారు)గా పని చేస్తున్నారు. చిన్న వయస్సులోనే కమర్షియల్ విమానాలు నడిపే లైసెన్స్ పొందారు. ఢిల్లీలోని ఎయిర్ ఫోర్స్ బాలభారతి పాఠశాలలో విద్యార్థినిగా శాంభవి పాఠక్ తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 2016-18లో సెకండరీ స్కూల్ పూర్తయ్యాక ముంబై యూనివర్సిటీ నుంచి ఏరోనాటిక్స్, ఏవియేషన్, ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందారు. వాణిజ్య విమానాల శిక్షణ కోసం ఆమె న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో చేరారు. అనంతరం భారత్‌కు వచ్చి డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రొజెన్ ఎయిర్ లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు. అంటే, భవిష్యత్తులో పెద్ద విమానాల కెప్టెన్ కావడానికి అవసరమైన సర్టిఫికెట్ అని చెప్పవచ్చు. మధ్యప్రదేశ్ ఫ్లయింగ్ క్లబ్‌లో కొత్త పైలట్లకు శిక్షణ ఇచ్చేలా అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా పని చేశారు. ఆమె క్రమశిక్షణ, నైపుణ్యం, పని పట్ల మక్కువ కలిగి ఉంటారని ఆమె గురించి తెలిసిన వారు చెబుతారు. 2022 నుంచి ఆమె వీఎస్ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పూర్తిస్థాయి ఫస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీఐపీలు, బిజినెస్ ప్రముఖులు ప్రయాణించే లియర్ జెట్-45 లాంటి విమానాలను ఆమె నడుపుతున్నారు. ఈరోజు అజిత్ పవార్ ప్రయాణించిన విమానంలో పైలట్ ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్ ఉన్నారు. శాంభవి పాఠక్ ఫస్ట్ ఆఫీసర్‌గా పని చేశారు.

## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

**అజిత్ మృతిపై శరద్ పవార్ భావోద్వేగం**

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై సీనియర్ నాయకుడు శరద్ పవార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇది కేవలం ప్రమాదం మాత్రమేనని, దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఆయన స్పష్టం చేశారు. "అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం వాటిల్లింది. ఒక సమర్థుడైన నాయకుడిని ఈ రోజు మనం కోల్పోయాం. ఈ లోటు ఎప్పటికీ పూడ్చలేనిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "అన్నీ మన చేతుల్లో ఉండవు. కొన్ని సంఘటనల వెనుక ఎలాంటి రాజకీయం ఉండదు. దయచేసి ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దు. ఈ బాధను మహారాష్ట్ర, మనమందరం ఎప్పటికీ భరించాల్సిందే" అని శరద్ పవార్ అన్నారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణిస్తున్నది వీఎస్ఆర్ ఏవియేషన్‌కు చెందిన బాంబార్డియర్ లియర్ జెట్- 45 విమానంగా అధికారులు గుర్తించారు. ప్రమాద స్థలంలో దట్టమైన పొగలు కమ్ముకున్న దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.



## మా విమానం ఫిట్‌గానే ఉంది

**అజిత్ పవార్ విమాన యజమాని వివరణ**

ముంబై: వీఎస్ఆర్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 మోడల్ విమానంలో ప్రయాణిస్తూ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. లియర్ జెట్ మోడల్ విమానం 2023లో కూడా ఇదేవిధంగా ముంబైలో క్రాష్ ల్యాండ్ అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ మోడల్‌కు చెందిన ఇతర విమానాలను నిలిపివేస్తారా అని మీడియా ప్రతినిధులు వీఎస్ఆర్ సంస్థ యజమాని వీకే సింగ్‌ను ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, తమ విమానాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని ఆయన అన్నారు. అవి ప్రయాణాలకు అనువుగానే ఉన్నాయని వెల్లడించారు. విమానాలు ఫిట్‌గా ఉన్నప్పుడు వాటిని నిలిపివేయాల్సిన అవసరం ఏమిటని ఆయన ఎదురు ప్రశ్నించారు. బారామతి విమాన ప్రమాదంలో మృతి చెందిన పైలట్లు కూడా అనుభవం కలిగిన వారేనని తెలిపారు. ఇన్ కమాండ్ కెప్టెన్ సుమిత్ కపూర్‌కు 16,000 గంటలు నడిపిన అనుభవం, కోపైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్‌కు 1,500 గంటలు నడిపిన అనుభవం ఉందని అన్నారు.

## అజిత్ పవార్ మృతిలో కుట్రకోణం!

**విమాన ప్రమాదంపై మమతా సంచలన వ్యాఖ్యలు**

కోల్‌కతా: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బారామతి విమాన ప్రమాదంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో దేశంలోని రాజకీయ నాయకుల భద్రతపై కూడా అనుమానాలు తలెత్తుతున్నాయని ఆమె అన్నారు. అజిత్ పవార్ మృతిలో కుట్రకోణం ఉండవచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పవార్ మరణ వార్త విని తాను దిగ్భ్రాంతికి గురయ్యానని, ఆయన మృతి రాష్ట్రానికి, దేశానికి తీరని వెలితి అన్నారు. సుప్రీంకోర్టు పైన మాత్రమే తమకు నమ్మకం ఉందని, అత్యున్నత న్యాయస్థానం పర్యవేక్షణలోనే దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఇతర దర్యాప్తు సంస్థలపై తమకు విశ్వాసం లేదని, అవి వాటి స్వేచ్ఛను కోల్పోయాయని విమర్శించారు. అజిత్ పవార్ బీజేపీని వీడాలని ఆలోచిస్తున్నారని ఇటీవల ప్రచారం జరిగిందని ఈ సందర్భంగా మమతా బెనర్జీ గుర్తు చేశారు. పవార్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పారదర్శక దర్యాప్తు జరగాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ విజ్ఞప్తి చేశారు.

## డాలర్‌కు 15 లక్షల రియాల్స్

**ఇరాన్ కరెన్సీ చారిత్రక పతనం**

టెహ్రాన్: ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ నిన్న చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఒక డాలర్‌కు 15 లక్షల రియాల్స్ చొప్పున స్థానిక ఎక్స్ఛేంజ్ కేంద్రాలు ధరను నిర్ణయించాయి. అంతర్జాతీయ ఆంక్షలు, ముఖ్యంగా దేశ అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలు, ప్రభుత్వ అధికారుల అసమర్థ నిర్వహణ వంటి కారణాలతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే కరెన్సీ విలువ పడిపోవడంతో గతేడాది డిసెంబర్ 28న ప్రజలు నిరసనలు ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ ఆందోళనలు దేశవ్యాప్తంగా విస్తరించి తీవ్ర రూపం దాల్చాయి. ప్రజల నిరసనలను అక్కడి మత పెద్దల ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తోంది. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రెండు వారాలకు పైగా ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. నిరసనలను అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన చర్యల కారణంగా ఇప్పటివరకు కనీసం 6,126 మంది మృతిచెందారని, మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండవచ్చని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో వాస్తవ పరిస్థితులు, మరణాల సంఖ్యపై పూర్తి స్పష్టత రావడం లేదు.

## ఫ్రాన్స్‌లో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

న్యూఢిల్లీ: సోషల్ మీడియా ప్రభావం నుంచి పిల్లలను దూరం చేయడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పదిహేనేళ్లలోపు చిన్నారులకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధిస్తూ బిల్లు తీసుకొచ్చింది. ఫ్రాన్స్ దిగువ సభలో ఈ బిల్లుకు సభ్యుల మద్దతు లభించిందని, త్వరలో దీనిపై సెనేట్ లో చర్చించి చట్టంగా మారుస్తామని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చెప్పారు. సోషల్ మీడియా అందుబాటులో ఉండడంతో పిల్లలు నిత్యం అందులోనే మునిగితేలుతున్నారని, దీనివల్ల వారిలో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. గంటల తరబడి సెల్ ఫోన్ స్క్రీన్ కు అతుక్కుపోవడం వల్ల పిల్లల్లో కంటిచూపు సంబంధిత సమస్యలు, మానసిక సమస్యలకు గురవుతున్నారని మాక్రాన్ వివరించారు. ఫిబ్రవరి నెలాఖరుకి సెనెట్ ఈ బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని, సెప్టెంబరు 1 నుంచి చట్టం అమల్లోకి వస్తుందని అధికారులు పేర్కొన్నారు. 15 ఏళ్లలోపు పిల్లల ఖాతాలను తొలగించడానికి సోషల్ మీడియా కంపెనీలకు డిసెంబర్ 31 వరకు సమయం ఇస్తామని తెలిపారు. కొత్త చట్టం ప్రకారం.. పాఠశాలల్లో పిల్లల మొబైల్ వాడకంపైనా నిషేధం ఉంటుందన్నారు. కాగా, పదహారేళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియా వాడకుండా ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇప్పటికే నిషేధం విధించి అమలు చేస్తోంది.

వయ్యారి చిత్రం



నేహా ఖాన్

## నాగ్ 100వ సినిమాలో టబు?



టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో నాగార్జున తన 100వ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యారు. ఈ సినిమాలో టబు కీలక పాత్రలో కనిపించబోతుంది అనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. నాగార్జున, టబు కాంబో కి మంచి క్రేజ్ ఉంటుంది. అభిమానులు మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారు వీరి కాంబోను ఎంజాయ్ చేస్తారు. వీరు చేసింది రెండు మూడు సినిమాలే అయినప్పటికీ కచ్చితంగా వీరి కాంబో ఇప్పటికీ వర్కౌట్ అయ్యేదే అన్నట్లుగా విశ్లేషకులు సైతం మాట్లాడుతూ ఉంటారు. అంతే కాకుండా వ్యక్తిగతంగా కూడా నాగార్జున, టబు సన్నిహితులు, స్నేహితులు ఇంకా ఇంకా అనే ప్రచారం ఉంది. ఆ విషయాన్ని పక్కన పెడితే సినిమా కోసం వీరిద్దరు చాలా కాలం తర్వాత కలవడం కన్ఫర్మ్ అన్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల ద్వారా తెలుస్తోంది. నాగార్జునకి 100వ సినిమా చాలా ప్రత్యేకమైనది అనడంలో సందేహం లేదు. ఆ ప్రత్యేకమైన సినిమాలో నాగ్ కెరీర్‌లో చాలా స్పెషల్ లేడీ అయిన టబు నటించడం ద్వారా సినిమా మరింత ప్రత్యేకమైనదిగా మారుతుంది అని అక్కినేని అభిమానులతో పాటు ప్రేక్షకులు బలంగా నమ్ముతున్నారు.




## మేలో వెంకీ ఆదర్శ కుటుంబం రిలీజ్!

టాలీవుడ్‌లో విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌కు ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వస్తున్న ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47 సినిమా కోసం ఆడియన్స్ చాలా కాలంగా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. గతంలో త్రివిక్రమ్ కేవలం రైటర్‌గా ఉన్నప్పుడే వెంకీకి అదిరిపోయే హిట్స్ ఇచ్చారు. ఇప్పుడు డైరెక్టర్‌గా కూడా మొదటిసారి ఈ ఇద్దరు కలవడంతో అంచనాలు గట్టిగానే పెరుగుతున్నాయి. సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి ఎప్పుడెప్పుడు వస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గ్యాప్ లేకుండా జెట్ స్పీడ్‌లో జరుగుతోంది. వెంకటేష్ తన గత ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసుకుని ఈ మూవీ సెట్స్‌లో జాయిన్ అయ్యారు. త్రివిక్రమ్ కూడా ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా రోజుకు ఎక్కువ సీన్స్ షూట్ చేస్తూ చిత్రీకరణను ముందుకు తీసుకెళ్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ విత్ క్రైమ్ టచ్ ఉన్న ఈ కథలో వెంకీ తన మార్క్ పెర్ఫార్మెన్స్‌తో మరోసారి మెప్పించబోతున్నారు. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఇప్పుడు అదిరిపోయే బజ్ ఉంది. ఈ సినిమా రిలీజ్ విషయంలో వస్తున్న సరికొత్త అప్‌డేట్ ఇప్పుడు ఫ్యాన్స్‌లో ఫుల్ జోష్ నింపుతోంది. దసరా లేదా దీపావళి అని కాకుండా, మే 2026లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అంటే 2026 సమ్మర్ కానుకగా బాక్సాఫీస్ వద్ద విక్టరీ జాతర ఖాయంగా కనిపిస్తోంది.

## దీపిక ప్లేస్‌లో సాయిపల్లవి

కల్కి సినిమా రిలీజై చాలాకాలమవుతున్నా కల్కి2 ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. దానికి కారణాలెన్నో ఉన్నాయి. ప్రభాస్ వేరే సినిమాలతో కమిట్ అవడంతో పాటూ, కల్కిలో కీలక పాత్రలో నటించిన దీపికా ఈ సినిమా నుంచి తప్పుకోవడం కూడా మెయిన్ రీజన్. కల్కిలో దీపికా చేసిన పాత్ర చాలా కీలకమైనది. అలాంటి పాత్ర నుంచి ఆమె తప్పుకోవడంతో ఆ పాత్రలో ఎవరిని తీసుకోవాలా అని మేకర్స్ ఆలోచనలో పడ్డారు. అయితే ఇప్పుడా పాత్రలో సాయి పల్లవిని వరించిందని సమాచారం. కల్కి2లో సాయి పల్లవి ఆల్మోస్ట్ కన్ఫర్మ్ అయ్యారని, త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్



కూడా వచ్చే అవకాశముందని తెలుస్తోంది. అదే నిజమైతే ప్రభాస్, సాయి పల్లవి కలిసి ఒకే సినిమాలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా, ఇందులో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది. కల్కిలో సుమతి క్యారెక్టర్ ఎంత కీలకమైనదో తెలిసిందే. అలాంటి పాత్రకు మంచి పెర్ఫార్మర్ లేకపోతే మొదటికే దెబ్బ అనుకుని చిత్ర యూనిట్ సాయి పల్లవిని తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ లో బిజీగా ఉన్న కల్కి2 టీమ్, ఈ సమ్మర్ నుంచి షూటింగ్ ను మొదలుపెట్టనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్ లో రామాయణ చేస్తున్న సాయి పల్లవి కల్కి2లో నటిస్తే క్రేజ్ పరంగా కూడా వర్కవుట్ అయ్యే అవకాశాలున్నాయి.



## శ్రుతిహాసన్ బర్త్ డే స్పెషల్.. నోట్లో సిగరెట్!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న లేటెస్ట్ ఫీల్-గుడ్ ఎంటర్టైనర్ ఆకాశంలో ఒక తార. యువ దర్శకుడు పవన్ సాదినేని తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుండి వెలువడిన ఒక సర్ప్రైజ్ అప్‌డేట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ చిత్రంలో గ్లామరస్ బ్యూటీ శ్రుతి హాసన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. శ్రుతి హాసన్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేసింది. ఇందులో శ్రుతిహాసన్ కళ్లద్దాలు పెట్టుకొని, నోటిలో సిగరెట్ పెట్టుకొని భిన్నమైన లుక్ లో కనిపించింది. ఈ సినిమాలో ఆమె ఒక బోల్డ్, ప్రోత్సాహకరమైన సైన్స్ టీచర్ పాత్రలో కనిపించబోతోంది. విడుదలైన పోస్టర్స్‌లో శ్రుతి లుక్ చాలా కొత్తగా, కాన్ఫిడెంట్‌గా ఉంది. సాత్విక వీరవల్లి ఈ చిత్రంతో కథానాయికగా పరిచయం కానుంది. ఇక ఆమె తన కలలను నిజం చేసుకునే ప్రయాణంలో శ్రుతి హాసన్ పాత్ర కీలక మలుపుగా నిలవబోతున్నట్లు తెలుస్తోంది. ఒక గురువుగా మార్గదర్శిగా శ్రుతి ఇచ్చే స్ఫూర్తి ఈ సినిమాకే హైలైట్ కానుందని ఇండస్ట్రీ వర్గాల సమాచారం.



## చాలా రోజులు ఏడ్చేశా

సినిమా ఫ్లాప్ అయితే నటీనటులపై నెట్టింట విమర్శలు, ట్రోలింగ్ సహజం. బాలీవుడ్ హాట్ లేడీ భూమీ పడ్నేకర్‌కు కూడా అలాంటి ఘటనే ఎదురవడంతో నెలల తరబడి ఏడ్చేసిందట. ది రాయల్స్ సిరీస్ పై వచ్చిన విమర్శలకు చాలా కుంగిపోయానని బాధపడింది. ఇషాన్ కట్టర్-భూమీ పడ్నేకర్ మధ్య రొమాంటిక్ ఇంటిమేట్ సన్నివేశాలు సిరీస్ కి కలిసొచ్చాయి. కానీ రిలీజ్ అనంతరం సిరీస్ పై ఎన్నో విమర్శలొచ్చాయి. అవన్నీ భూమి పడ్నేకర్ ను ఎంతో నిరాశకు గురిచేసాంది. వాటి కారణంగా మానసికంగాను ఎంతో అలసిపోయానంది. ఆ ఎదురు దెబ్బతో నటిగా, వ్యక్తిగా తాను ఎవరో అన్నది కూడా మర్చిపోయి వ్యవహరించానంది. ఆ విమర్శలు కారణంగా ఏకంగా తొమ్మిది నెలలు పాటు ఎలాంటి సినిమాలు చేయకుండా దూరంగా ఉన్నానంది. చివరికి తీసుకున్న అడ్వాన్స్ లు కూడా తిరిగి ఇచ్చేసానని తెలిపింది. ఆ విమర్శలు వ్యక్తిగతంగా బాధించడంతో గుర్తొచ్చినప్పుడల్లా కన్నీటి పర్యంతం చెందేదానినని గుర్తు చేసుకుంది.

## అమెజాన్‌లో శోభిత ధూళిపాళ్ల 'చీకటిలో' ట్రెండింగ్




ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోలో రిలీజైన తెలుగు క్రైమ్ డ్రామా చీకటిలో నెంబర్ వన్ పొజిషన్ లో ట్రెండింగ్ అవుతుంది. చీకటిలో ఓటీటీలోకి వచ్చినప్పటి నుంచి మంచి వ్యూయర్‌షిప్ తో అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సినిమాలోని స్టోరీ, స్క్రీన్ ప్లే గురించి ఆడియన్స్ సోషల్ మీడియాలో డిస్కషన్స్ చేస్తూ తమ తమ అనుభవాల్ని షేర్ చేసుకుంటున్నారు. ఈ మూవీలో శోభితా ధూళిపాల ప్రధాన పాత్రలో నటించగా, సినిమాలో ఆమె నటనకు నెటిజన్ల నుంచి మంచి ప్రశంసలొస్తున్నాయి. ఈ మూవీలో శోభిత యాక్టింగ్, నేచురల్ డైలాగ్ డెలివరీ, తన స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు మేజర్ ప్లస్ అవగా, ఆమె యాక్టింగ్, తన క్యారెక్టర్ సెకండాఫ్ లో కథకు వెయిట్ ను పెంచిందని భావిస్తున్నారు. అయితే ఈ విషయంలో కొందరు మాత్రం సినిమా మొత్తాన్ని శోభితా యాక్టింగ్ పైనే ఆధారపడేలా చేశారని కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి తక్కువ బడ్జెట్, సమయంలో తీసిన చీకటిలో సినిమాకు ఓటీటీలో మంచి ఆదరణ దక్కుతుంది. సినిమా చిన్న స్థాయిలో ఉన్నప్పటికీ, ఓటీటీ ఆడియన్స్ కు మంచి ఇంట్రెస్ట్ ను కలిగిస్తుందని, దానికి తోడు సినిమాకు మంచి మౌత్ టాక్ లభించడం కూడా ప్లస్సైంది. కథ పరంగా చెప్పుకుంటే సినిమా కాస్త నెమ్మదిగా అనిపించినప్పటికీ చీకటిలో మూవీకి మంచి రెస్పాన్సే వస్తుంది. ఓవరాల్ గా చీకటిలో మూవీకి నెటిజన్ల నుంచి కొన్ని విషయాల్లో ప్రశంసలతో పాటూ, మరికొన్ని విషయాల్లో విమర్శలు కూడా వస్తున్నాయి. టెక్నికల్ గా కూడా ఈ సినిమా రిచ్ గానే ఉంది. సౌండ్ డిజైన్ నుంచి సినిమాటోగ్రఫీ వరకు సినిమా రియలిస్టిక్ గా ఉండేలా చేయగలిగాయి. మొత్తానికి కంటెంటె ఓరియెంటెడ్ సినిమాలను మెచ్చే ఓటీటీ ఆడియన్స్ కు చీకటిలో సినిమా ఒక మంచి ఆప్షన్ గా నిలిచింది.






# శివమ్ దూబే పోరాటం వృథా

## నాలుగో టీ20లో టీమిండియా ఓటమి

**వరుసగా మూడు టీ20ల్లో గెలిచిన భారత జట్టుకి, న్యూజీలాండ్షాక్ ఇచ్చింది. వైజాగ్‌లో జరిగిన నాలుగో టీ20లో 50 పరుగుల తేడాతో గెలిచి, క్లీన్ స్వీప్ నుంచి బయటపడింది. 215 పరుగుల భారీ లక్ష్యఛేదనతో బ్యాటింగ్‌కి దిగిన భారత జట్టు, 18.4 ఓవర్లలో 165 పరుగులకి ఆలౌట్ అయ్యింది. శివమ్ దూబే హాఫ్ సెంచరీతో పోరాడినా, టీమిండియాకి విజయాన్ని మాత్రం అందించలేకపోయాడు.**

**ఇన్నింగ్స్ తొలి బంతికే అభిషేక్ శర్మ డకౌట్ అయ్యాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 2 ఫోర్లు బాది 8 పరుగులకి అవుట్ అయ్యాడు. 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది టీమిండియా. సంజూ శాంసన్, రింకూ సింగ్ కలిసి కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కి 46 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 15 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 24 పరుగులు చేసిన సంజూ శాంసన్‌ని మిచెల్ సాంట్నర్ క్లీన్ బౌల్డ్ చేశాడు.**

30 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 39 పరుగులు చేసిన రింకూ సింగ్, టాపార్డర్‌లో ప్రమోషన్ దక్కినా దాన్ని సరిగ్గా వాడుకోలేకపోయాడు. హార్ధిక్ పాండ్యా 2, హర్షిత్ రాణా 9 పరుగులు చేశారు. 23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 65 పరుగులు చేసిన శివమ్ దూబే, న్యూజీలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అయితే అన్యూహ్యంగా రనౌట్ కావడంతో మ్యాచ్ మళ్లీ న్యూజీలాండ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. అర్ష్‌దీప్ సింగ్ డకౌట్ కాగా బుమ్రా 4, కుల్దీప్ 1 పరుగు చేశారు. రవి భిష్ణోయ్ 10 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజీలాండ్జట్టు, నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు టిమ్ సిఫర్ట్, డివాన్ కాన్వే కలిసి తొలి వికెట్‌కి సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ ఇద్దరూ దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో 8 ఓవర్లలో 100 పరుగులు దాటింది అయితే భారత బౌలర్లు సూపర్ కమ్‌బ్యాక్ ఇచ్చారు. డివాన్ కాన్వే 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 పరుగులు చేసి కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. టిమ్ సిఫర్ట్ 36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 62 పరుగులు చేశాడు. రచిన్ రవీంద్ర 2 పరుగులు చేసి బుమ్రా బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ 16 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 24 పరుగులు చేయగా మార్క్ ఛాప్‌మన్ 9 పరుగులు, మిచెల్ సాంట్నర్ 11 పరుగులు చేసి అవుట్ అయ్యారు. జకరీ ఫోల్క్స్ 13 పరుగులు



చేశాడు. 8.1 ఓవర్ల వద్ద 100/0 స్కోరుతో ఉన్న న్యూజిలాండ్, 16.1 ఓవర్లు అయ్యేసరికి 163/6 స్థితికి చేరుకుంది. అయితే ఆఖర్లో డార్ల్ మిచెల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 39 పరుగులు చేసి, న్యూజీలాండ్స్కోరు 200 మార్కు దాటించాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ రెండేసి వికెట్లు తీయగా జస్ప్రిత్ బుమ్రా, రవి భిష్ణోయ్ చెరో వికెట్ తీశారు.



# పైసల కోసం ఇంత కక్కుర్తా?

**భారత్, పాక్‌కు ఈజీ గ్రూప్**

**ఐసీసీపై గవాస్కర్ తీవ్ర ఆగ్రహం**

ఐసీసీపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్, పాకిస్థాన్ జట్లను ఒకే గ్రూప్‌లో ఉంచడం, పసికూన దేశాలతో గ్రూప్ సీడింగ్ తీయడాన్ని తప్పుబట్టాడు. వాణిజ్య ప్రయోజనాల కోసమే ఐసీసీ ఇలా గ్రూప్ సీడింగ్ చేసిందని ఓ దినపత్రికకు రాసిన కాలమ్‌లో గవాస్కర్ విమర్శించాడు. భారత్, పాకిస్థాన్‌లు సునాయసంగా తదుపరి రౌండ్ చేరుకునేలా నమీబియా, అమెరికా, నెదర్లాండ్స్‌తో కూడిన గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్‌లు ఉంచిందని ఆరోపించాడు. 'సాధారణంగా జరిగే ప్రతి ఐసీసీ టోర్నీలానే.. ఈసారి కూడా భారత్, పాకిస్థాన్‌లను ఒకే గ్రూప్‌లో ఉంచారు. కేవలం ఈ రెండు దేశాల మధ్య కనీసం ఒక మ్యాచ్ నిర్వహించాలని, తద్వారా వచ్చే ఆదాయం, వ్యూయర్‌షిప్‌ను క్యాష్ చేసుకోవాలనే ఐసీసీ ఇలా ప్లాన్ చేసింది. భారత్, పాకిస్థాన్ జట్లు సునాయసంగా తదుపరి రౌండ్ అయిన సూపర్-8కు చేరుకునేలా ఈజీ గ్రూప్‌ను సిద్దం చేశారు. గ్రూప్ దశలో పెద్ద జట్లు పసికూనలతో తలపడుతుండటంతో సూపర్-8 నుంచే అసలు పోరు మొదలవ్వనుంది. అయితే ఈజీ గ్రూప్‌లో ఉన్నా పాకిస్థాన్‌కు అంత ఈజీ కాదు. గత ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పసికూన జట్ల చేతిలో ఓటమిపాలైంది. ముఖ్యంగా అమెరికా చేతిలో ఓడింది. ఈ సారి ఆ జట్టు కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే అమెరికా ఆటగాళ్లు మేజర్ లీగ్ క్రికెట్ ద్వారా కావాల్సిన అనుభవం పొందారు. మరింత బలంగా తయారయ్యారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా ఆడాలో కూడా తెలుసుకున్నారు. ఈ సారి కూడా పాకిస్థాన్‌కు అమెరికా షాక్ ఇవ్వవచ్చు. భారత్, పాక్‌లు సునాయసంగా సూపర్ 8కు చేరుకుంటాయి. అయితే పాకిస్థాన్ నిలకడలేమి ప్రదర్శన ఆ జట్టుకు ఇబ్బందులు కలిగించవచ్చు' అని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఫిబ్రవరి 7 నుంచి ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుండగా.. తొలి మ్యాచ్‌లో అమెరికాతో భారత్ తలపడనుంది. భారత్, పాక్ మ్యాచ్ కొలంబో వేదికగా ఫిబ్రవరి 15న జరగనుంది.

# గంభీర్.. నువ్వు మారవా?

**అయ్యర్‌ను ఆడించకపోవడంపై నెటిజన్ల ఫైర్**



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా వైజాగ్ వేదికగా జరుగుతున్న నాలుగో టీ20కి విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరం కాగా.. అతని స్థానంలో ఎక్స్‌ట్రా బౌలర్‌గా అర్ష్‌దీప్ సింగ్‌ను బరిలోకి దించారు. ఎక్స్‌ట్రా బ్యాటర్ అయిన శ్రేయస్ అయ్యర్‌ను ఆడించకుండా అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించడం ఏంటని నెటిజన్లు మండిపడుతున్నారు. అయ్యర్ అంటే గంభీర్‌కు గిట్టదని, వ్యక్తిగత కక్ష్యతోనే అతన్ని పక్కనపెడుతున్నాడని ఆరోపిస్తున్నారు. తిలక్ వర్మ స్థానంలో జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ గత మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమయ్యాడు. తిలక్ వర్మ పూర్తిగా కోలుకోకపోవడంతో అతన్ని చివరి రెండు టీ20లకు కూడా సెలెక్టర్లు కొనసాగించారు. కానీ తిలక్ వర్మకు బ్యాకప్‌గా అయ్యర్ సిద్దం చేయాల్సి ఉండగా.. టీమిండియా మేనేజ్‌మెంట్ మాత్రం అతన్ని పట్టించుకోవడం లేదు. ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున అద్భుత ప్రదర్శన కనబర్చి ఆ జట్టును 11 ఏళ్ల తర్వాత ఫైనల్ చేర్చిన అయ్యర్‌కు టీ20 జట్టులో చోటివ్వలేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కోసం ఆసియా కప్ 2025 టోర్నీకి ఎంపిక చేయలేదు. తిలక్ వర్మ గాయంతో జట్టులోకి వచ్చినా అతన్ని ఉద్దేశపూర్వకంగా తుది జట్టులోకి తీసుకోవడం లేదని ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. నిలకడకు మారు పేరైన శ్రేయస్ అయ్యర్‌ను ఆడించాల్సిందని, మెగా టోర్నీలో అతను బాగా ఉపయోగపడుతాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో అతను ఎంత విలువైన ఇన్నింగ్స్‌లో ఆడాడో ఒకసారి గంభీర్ గుర్తు చేసుకోవాలని హితవు పలుకుతున్నారు. 'గంభీర్.. మీరేంటో మీ విధానలేంటో .. అస్సలు అర్థం కావు'అని మీమ్స్ ట్రెండ్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం గంభీర్ నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. టీ20 ప్రపంచకప్ ముందు అయ్యర్‌కు అవకాశం ఇచ్చి జట్టును గందరగోళం చేయడం ఇష్టం లేకనే గంభీర్ ఈ నిర్ణయం తీసుకున్నాడని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఇషాన్ కిషన్ రూపంలో తిలక్ బ్యాకప్ ప్లేయర్ ఉన్నాడని మరొకరు అవసరం లేదనే యోచనలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఉందని చెబుతున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. డ్యూ ప్రభావం నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపాడు. ఇషాన్ కిషన్‌కు చిన్న గాయం కావడంతో అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వచ్చాడని చెప్పిన సూర్య.. అక్షర్ పటేల్ కోలుకోవడానికి ఇంకా కొంచెం సమయం పడుతుందన్నాడు.

# టి20 ర్యాంకింగ్స్ టాప్ 10లోకి సూర్య




ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ టీ20 ర్యాంకింగ్స్ లో భారత క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ టాప్ టెన్ బ్యాట్స్‌మెన్ జాబితాలో తిరిగి చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్.. ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకాడు. పొట్టి క్రికెట్‌లో పరుగులు సాధించడానికి ఇబ్బందిపడుతున్న సూర్యకుమార్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో 82, మూడో టీ20లో 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా మూడో టీ20లో 68 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. నాగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 929 రేటింగ్ పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇంగ్లండ్ క్రికెటర్ ఫిల్ సాల్ట్ (849), తిలక్ వర్మ (781) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకులో నిలిచాడు. అదేవిధంగా మూడో టీ20లో మూడు వికెట్లు తీసి రాణించాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్ధిక్ పాండ్య ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకుకు, శివమ్ దుబే ఐదు స్థానాలు ఎగబాకి పదకొండవ ర్యాంకుకు చేరుకున్నారు.



# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి జోకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి నోవాక్ జోకోవిచ్ ప్రవేశించాడు. ఈ నేపథ్యంలో ఆ టెన్నిస్ స్టార్ చరిత్ర సృష్టించారు. క్వార్టర్ ఫైనల్‌తో పాటు రౌండ్-16లోనూ ఒక్క సెట్ కూడా గెలవకుండానే సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్త రికార్డులు క్రియేట్ చేశాడు. క్వార్టర్స్‌లో ఓటమి అంచు నుంచి బయటపడ్డ అతను.. చాలా లక్కీగా సెమీస్‌కు ఎంట్రీ ఇచ్చాడు. రాడ్ లావెర్ ఎరినా లో ఇవాళ జరిగిన క్వార్టర్స్ మ్యాచ్ నుంచి ఇటలీ ప్లేయర్ లోరెంజో ముసెటి గాయంతో తప్పుకున్నాడు. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో ముసెటి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ఇక గెలుపు ఖాయం అనుకున్న దశలో.. తొడ కండరాలు పట్టేయడంతో ముసెటి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. 6-4, 6-3 స్కోరుతో ముసెటి తొలి రెండు సెట్లను కైవసం చేసుకున్నాడు. ఇక మూడవ సెట్‌లోనూ 3-1 తేడాతో ఆధిపత్యంలో కొనసాగుతున్నాడు. ఆ సమయంలో ముసెటి కుడి తొడలో తీవ్రమైన నొప్పి వచ్చింది. ఆ దశలో అయిదో సీడ్ ముసెటి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. గాయం వల్ల తప్పుకోవడంతో లక్కీగా జోకోవిచ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. అంతకుముందు రౌండ్-16లో కూడా జాకబ్ మెన్సిక్ గాయంతో తప్పుకున్నాడు. ఆ మ్యాచ్‌లో జోకోవిచ్‌కు వాకోవర్ లభించింది. దీంతో రెండు మ్యాచుల్లో ఒక్క సెట్ కూడా గెలవకుండా జోకోవిచ్ సెమీస్‌లోకి ఎంటర్‌కావడం విశేషం. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్త రికార్డు క్రియేట్ చేశాడు జోకోవిచ్. ఆ గ్రాండ్‌స్లామ్‌లో 103వ మ్యాచ్ గెలిచాడు. గతంలో రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాఆడు. మెల్‌బోర్న్ పార్క్‌లో స్విస్ ప్లేయర్ ఫెదరర్ కూడా వందకు పైగా మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. మూడు రకాల గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో జోకోవిచ్ వందకుపైగా మ్యాచ్‌లను గెలవడం గమనార్హం.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 29-1-2026

# ప్రజాస్వామ్యానికి అసలైన పునాది వార్తాపత్రిక




భారతదేశంలో అక్షర సేద్యానికి అంకురార్పణ జరిగిన రోజు జనవరి 29. సరిగ్గా 1780వ సంవత్సరంలో ఇదే రోజున కోల్‌కతా నుంచి జేమ్స్ అగస్టస్ హికీ హికీస్ బెంగాల్ గెజెట్ పేరుతో దేశంలోనే తొలి పత్రికను ప్రారంభించారు. కేవలం రెండు పేజీలతో మొదలైన ఆ ప్రయాణం, నేడు కోట్ల మంది ప్రజల గొంతుకగా మారి భారత ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వార్తాపత్రికలు అమోఘమైన పాత్ర పోషించాయి. అప్పటి బ్రిటిష్ పాలకుల అణచివేత ధోరణిని ఎండగడుతూ, ప్రజల్లో జాతీయతను, చైతన్యాన్ని రగిలించడంలో పత్రికలే ప్రధాన ఆయుధాలుగా నిలిచాయి. గాంధీజీ, తిలక్ వంటి మహనీయులు పత్రికల ద్వారానే స్వరాజ్య కాంక్షను పల్లెపల్లెకూ చేరవేశారు. రాజారామ్ మోహన్ రాయ్ సంవాద్ కౌముది, బాల గంగాధర్ తిలక్ కేసరి, మహాత్మా గాంధీ యంగ్ ఇండియా వంటి పత్రికలు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశాయి. నాడు పత్రికలు కేవలం సమాచార సాధనాలు కావు, అవి స్వేచ్ఛా పోరాట ఆయుధాలు. నేటి సోషల్ మీడియా, డిజిటల్ యుగంలో వార్తలు క్షణాల్లో అరచేతిలోకి వచ్చేస్తున్నాయి. ఈ వేగవంతమైన మార్పుల మధ్య ప్రింట్ మీడియా మనుగడపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ, విశ్వసనీయత విషయంలో ఇప్పటికీ వార్తాపత్రికలదే పైచేయి. వాస్తవాలను వడబోసి, లోతైన విశ్లేషణలతో పాఠకులకు అందించడంలో పత్రికలు చూపిస్తున్న నిబద్ధత వెలకట్టలేనిది.

ప్రజాస్వామ్యంలో పాలకుల తప్పులను ఎండగట్టడం, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం పత్రికల బాధ్యత. నకిలీ వార్తలు రాజ్యమేలుతున్న తరుణంలో, నిష్పక్షపాతంగా, నిర్భయంగా వార్తలను అందించే పత్రికల అవసరం మునుపటి కంటే ఇప్పుడే ఎక్కువుంది. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజల పక్షాన నిలిచేది పత్రికారంగమే. పాలకుల విధానాలను విశ్లేషించి, అందులోని లోటుపాట్లను ఎండగట్టడంలో పత్రికలదే కీలక పాత్ర. అణగారిన వర్గాల సమస్యలను, గ్రామీణ భారత పరిస్థితులను వెలుగులోకి తేవడంలో ముద్రణారంగం విశేష కృషి చేస్తోంది. ప్రభుత్వ పథకాలను ప్రజలకు, ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి చేరవేసే వారధిగా పత్రికలు పనిచేస్తాయి. వాణిజ్య ప్రయోజనాల కోసం వార్తలను వక్రీకరించడం పత్రికా విలువలకు గొడ్డలిపెట్టుగా మారింది. కాగితం ధరల పెరుగుదల, డిజిటల్ ప్రకటనల పోటీ వల్ల ముద్రణారంగం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే, ఎన్ని డిజిటల్ మాధ్యమాలు వచ్చినా, ఉదయాన్నే కప్పు కాఫీతో పత్రికను చేతబట్టి చదివే అనుభూతి, అందులోని విశ్వసనీయత సాటిలేనివి. పత్రిక స్వేచ్ఛను కాపాడుకోవడం కేవలం పాత్రికేయుల బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. పత్రికారంగం నిష్పక్షపాతంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం



# ఆధ్యాత్మిక జ్యోతి.. రామకృష్ణ మఠం

**భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో 19వ శతాబ్దం ఒక నూతన అధ్యాయం. మూఢనమ్మకాలు, కులమత వైషమ్యాలతో కొట్టుమిట్టాడుతున్న సమాజానికి 'సర్వమత సమన్వయం' అనే అమృతాన్ని పంచిన మహనీయుడు శ్రీ రామకృష్ణ పరమహంస. ఆయన చూపిన మార్గంలో, లోక కల్యాణమే పరమావధిగా స్వామి వివేకానంద చేత స్థాపించబడిన రామకృష్ణ మఠం, మిషన్ నేడు ప్రపంచవ్యాప్తంగా శాంతికి, సేవకు చిరునామాగా నిలిచాయి.**


ఆధునిక భారతదేశంలో ఆధ్యాత్మికత, సామాజిక సేవలు ఒకే చోట సమన్వయం చేసిన అద్భుతమైన సంస్థ రామకృష్ణ మఠం. శ్రీ రామకృష్ణ పరమహంసుల ఆధ్యాత్మిక దర్శనాలు, స్వామి వివేకానందుల దూరదృష్టి ద్వారా స్థాపితమైన ఈ మఠం, భారతీయ సంస్కృతికి, మానవత్వానికి ఒక గొప్ప ఆదర్శం. రామకృష్ణ పరమహంస 1886లో మరణించిన తర్వాత, ఆయన శిష్యులను ఒక తాటిపైకి తెస్తూ స్వామి వివేకానంద 1897 మే 1న రామకృష్ణ మిషన్‌ను స్థాపించారు. ఈ సంస్థ ప్రధాన నినాదం ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ (తమ మోక్షం కోసం మరియు లోక కల్యాణం కోసం). కేవలం హిమాలయాలకు వెళ్లి తపస్సు చేసుకోవడం కాకుండా, కష్టాల్లో ఉన్న తోటి మనిషికి సేవ చేయడం ద్వారా భగవంతుడిని చేరుకోవచ్చని వివేకానంద చాటి చెప్పారు. రామకృష్ణులు ఒక సాధారణ గ్రామీణ బాలుడిగా జన్మించి, కాళీ మాత భక్తిలో మునిగి, వివిధ మతాల సారాంశాన్ని అనుభవించారు. 'అన్ని మతాలు ఒకే దేవుని వైపు చూపుతాయి' అన్నది ఆయన సిద్ధాంతం. స్వామి వివేకానందులు (1863–1902), రామకృష్ణుల శిష్యుడిగా, 1893 చికాగో మతాల మహాసభలో హిందూ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఆ తర్వాత భారత్ తిరిగి వచ్చి, మఠం స్థాపించారు. బేలూర్ మఠం (హౌరా, పశ్చిమ బెంగాల్) దీని ప్రధాన కేంద్రం. రామకృష్ణ మఠం చేసే సేవలో ఎలాంటి రాజకీయ లేదా కుల విభేదాలు ఉండవు. వీరి కార్యకలాపాలు ప్రధానంగా ఐదు రంగాల్లో విస్తరించాయి. అవి విద్య, వైద్యం, విపత్తు సహాయం, ఆధ్యాత్మిక ప్రచారం, గ్రామీణాభివృద్ధి. దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలలు, కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలను నిర్వహిస్తూ, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆసుపత్రులు, మొబైల్ క్లినిక్‌ల ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వరదలు, కరువులు లేదా భూకంపాలు సంభవించినప్పుడు రామకృష్ణ మిషన్ వలంటీర్లు అందించే సహాయం చాలా గొప్పది. శ్రీ రామకృష్ణ ప్రభ వంటి పత్రికల ద్వారా, వేదాంత గ్రంథాల ప్రచురణ ద్వారా ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని సామాన్యులకు చేరువ చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో స్వయం ఉపాధి, వ్యవసాయ శిక్షణ ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారు. 'ఎన్ని మార్గాలో అన్ని మతాలు' అని చెప్పిన రామకృష్ణుల సిద్ధాంతాన్ని ఈ మఠం తూచా తప్పకుండా పాటిస్తుంది. ఇక్కడ అన్ని మతాల పండుగలను గౌరవప్రదంగా జరుపుకుంటారు. క్రైస్తవ, ఇస్లాం ఇతర మతాల్లోని సత్యాలను స్వీకరిస్తూ సార్వత్రిక సోదరభావాన్ని పెంపొందిస్తుంది. రామకృష్ణ మఠం కేవలం ఒక భవనం కాదు, అది ఒక సంస్కృతి. అధికారం కోసం ఆరాటం లేని, ఆడంబరాలకు తావులేని ఈ సన్యాసుల జీవనశైలి సమాజానికి గొప్ప పాఠం. కులమతాలకు అతీతంగా, మనిషిని మనిషిగా గౌరవిస్తూ, సేవ ద్వారా దైవత్వాన్ని వెతుక్కోవడమే ఈ సంస్థ మనకు ఇచ్చే గొప్ప సందేశం. నేటి స్వార్థపూరిత ప్రపంచంలో రామకృష్ణ మఠం ఒక చల్లని వెన్నెలగా, దారిచూపే దీపంగా నిలుస్తోంది.



రామస్వామి చింత

# ధర్మ నిరతికి నిలువుటద్దం
# భీష్మ ఏకాదశి

**భారతీయ కాలమానంలో మాఘ శుద్ధ ఏకాదశికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. దీనినే మనం భీష్మ ఏకాదశి అని పిలుచుకుంటాం. కురువృద్ధుడు, గంగాపుత్రుడు అయిన భీష్మ పితామహుడు తన దేహాన్ని త్యజించి, పరమపదాన్ని పొందిన పుణ్యదినం ఇది. కేవలం ఒక వ్యక్తి మరణించిన రోజుగా కాకుండా, ధర్మం, నిబద్ధత, ఈశ్వర భక్తికి ప్రతీకగా ఈ రోజును జాతి స్మరించుకుంటుంది. కురుక్షేత్ర సంగ్రామంలో అంపశయ్యపై పవళించిన భీష్ముడు, ఉత్తరాయణ పుణ్యకాలం కోసం వేచి చూశాడు.**




సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించి, పగటి కాలం పెరిగే ఈ కాలం మోక్షప్రదాయకమని శాస్త్ర వచనం. భీష్ముడు తన తండ్రి శంతన మహారాజు నుంచి పొందిన స్వచ్ఛంద మరణం వరంతో, తన ప్రాణాలను అదుపులో ఉంచుకుని, ఈ ఏకాదశి నాడే శ్రీకృష్ణుని స్మరిస్తూ విష్ణుసాయుజ్యం పొందారు. ఈ రోజుకు ఉన్న మరో గొప్ప విశిష్టత విష్ణు సహస్రనామ స్తోత్రం. అంపశయ్యపై ఉన్న భీష్ముడిని ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా, సాక్షాత్తు శ్రీకృష్ణుడి సమక్షంలో భీష్ముడు ఈ స్తోత్రాన్ని ఉపదేశించాడు. లోకానికి శాంతిని, ముక్తిని ప్రసాదించే ఈ మహత్తర స్తోత్రం పుట్టిన రోజు కావడంతో, భీష్మ ఏకాదశిని విష్ణు సహస్రనామ జయంతిగా కూడా జరుపుకుంటారు. ఏకాదశి అంటే ఇంద్రియాలను నిగ్రహించి భగవంతుని చెంత ఉండటం. ఈ రోజు ఉపవాసం ఉండటం వల్ల శారీరక శుద్ధితో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. భీష్మ ఏకాదశి నాడు విష్ణు సహస్రనామ పారాయణం చేయడం వల్ల అనంతమైన పుణ్యఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం. పితృదేవతల ఆశీస్సుల కోసం, భీష్ముడిని స్మరిస్తూ ఇచ్చే తర్పణం విశేష ఫలితాలనిస్తుంది. భీష్ముడి జీవితం మనకు నేర్పే పాఠం – నిబద్ధత. ఆడిన మాట కోసం రాజ్యాన్ని, సుఖాలను త్యాగం చేసిన ఆయన వ్యక్తిత్వం నేటి సమాజానికి ఎంతో అవసరం. అధికారం కోసం ధర్మాన్ని విస్మరించే ఈ కాలంలో, ధర్మం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలిన భీష్ముడి స్మరణ మనలో నైతిక విలువలను పెంపొందిస్తుంది. భీష్మ ఏకాదశి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది ఆత్మశోధనకు, ధర్మ మార్గంలో నడవడానికి ఒక ప్రేరణ.



బండపెల్లి రామనోహర్ శర్మ
ఆధ్యాత్మిక పండితుడు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.